
వార్త

ఆదివారం

20 అక్టోబరు, 2024


# భారతీయ రతన్ టాటా



## గుణశేఖర్ చిత్రంలో
# భూమికచావ్లా

తెలుగు సినీ పరిశ్రమలో కథానాయికగా భూమిక చావ్లాది ఓ ప్రత్యేక స్థానం. 'ఒక్కడు', 'ఖుషి' చిత్రాల్లో తన నటన, గ్లామర్‌తో భూమిక యువత హృదయాలను కొల్లగొట్టింది. ఆ తర్వాత నాని 'ఎంసీఏ'లో కీలక పాత్ర పోషించింది. కొంత కాలంగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ భామ తాజాగా గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'యుఫోరియా' సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. సమంతతో 'శాకుంతలం' చిత్రం తెరకెక్కించిన తరువాత గుణశేఖర్ విభిన్న ఎంటర్టైనర్‌గా 'యుఫోరియా' చిత్రం రూపొందించారు. మహేశ్‌బాబు, భూమిక కలయికలో గుణశేఖర్ తెరకెక్కించిన 'ఒక్కడు' ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. ఇరవై ఒక్క యేళ్ల తరువాత గుణశేఖర్ చిత్రంలో భూమిక నటిస్తున్నారు.

## తారాతీరం

# విక్రమ్‌కుమార్‌తో నితిన్ మరో సినిమా!

'భీష్మ' తరువాత నితిన్‌కు ఇప్పటివరకు సరైన విజయం దక్కలేదు. అందుకే గతంలో తనకు విజయాలు అందించిన దర్శకులతోనే పని చేయాలని నితిన్ నిర్ణయించుకున్నాడు. ప్రస్తుతం ఇంతకు ముందు ఆయనకు 'భీష్మ' లాంటి సక్సెస్‌ను ఇచ్చిన వెంకీ కుడుములతో రాబిన్ హుడ్ అనే చిత్రంలో నటిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్న కథానాయిక. దీంతోపాటు వేణుశ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' చిత్రంలో నటిస్తున్నాడు. ఇదిలా వుండగా నితిన్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

తన రెండో ఇన్నింగ్స్‌కు 'ఇష్క్' అనే మరపురాని బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని అందించిన విక్రమ్‌కుమార్‌తో ఈ కథానాయకుడు మరోసారి జత కట్టనున్నాడు. ఇటీవల 'హనుమాన్'తో బ్లాక్‌బస్టర్ విజయం అందుకున్న ప్రైమ్ షో సంస్థ అధినేత నిరంజన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యధిక బడ్జెట్‌తో నిర్మించనున్నట్లు సమాచారం. ఇప్పటివరకు నితిన్ చేయని ఓ డిఫరెంట్ జోనర్‌లో ఈ సినిమా వుండనున్నట్లు తెలుస్తోంది.



ఆదివారం వార్త

20 అక్టోబరు, 2024

## మంచి ముత్యాలు

బంగారం వల్లనే సోదరుల మధ్య అసహనం, కుటుంబాలలో వివాదాలు, దేశాల మధ్య యుద్ధాలు కలుగుతాయి.

- అబ్రహాం లింకన్

## విషయ విశేషం

కాఫీ, టీలతో నిద్రాభంగమా!.... 4

'సంఘీ'భావం....5

పోలవరానికి పకడ్బందీ ప్రణాళిక

కవర్ స్టోరీ..6

భారతీయ రతన్ టాటా

అతిరుచులతో రోగాలు.....11

ఈవారం కవిత్వం..12

పున్నమి వెలుగు

బీదర్‌లో వారసత్వ సంపద...14

ఔషధాల్లో మేటి యాలకులు...18

కథ.. 20

తోడు పెండ్లి కొడుకు

జీవిత సోపానాలు...23

సాహిత్యం.. 24

తెలుగువారి జాతీయ కవి విశ్వనాథ

పిచ్చిమొక్కలు అనుకుని పీకేయవద్దు... 25

ఫలించే ప్రార్థన...28

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### సెల్ఫీ ప్రింటర్

స్మార్ట్‌ఫోన్లు చేతిలోకి వచ్చాక జనాలకు ఎడాపెడా సెల్ఫీలు తీసుకోవడం అలవాటుగా మారిపోయింది. సెల్ఫీలు ఎంతసేపూ ఫోన్‌లోనో, కంప్యూటర్లలోనో చూసుకోవడమే తప్ప పాతకాలంలోలా వాటిని ప్రింట్ చేయించి, అల్బమ్స్‌లో దాచుకునే అలవాటు దాదాపు అంతరించింది. అయితే, సెల్ఫీలను ప్రింట్ చేసుకుని, దాచుకోవాలనే ముచ్చట కూడా కొందరికి ఉంటుంది. ఆ ముచ్చట తీర్చడానికే జపానీస్ కెమెరాల తయారీ కంపెనీ 'కేనన్' తాజాగా సెల్ఫీ ప్రింటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'సెల్ఫీ క్యూఎక్స్ 20' పేరుతో ఇటీవల మార్కెట్‌లోకి విడుదల చేసిన ఈ ప్రింటర్‌తో స్మార్ట్‌ఫోన్ నుంచి ఫొటోలను నేరుగా ముద్రించుకోవచ్చు. అలాగే, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో భద్రపరచుకున్న ఫొటోలను కూడా ముద్రించుకోవచ్చు. సెల్ఫీ లేఔట్ యాప్ ద్వారా ఈ ప్రింటర్ పనిచేస్తుంది. ఈ యాప్ ద్వారా ప్రింట్ తీసుకోవడానికి ముందు ఫొటోలను ఎడిట్ చేసుకోవడానికి, ఎంపిక చేసుకున్న ఫొటోల కొలాజ్ తయారు చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. భారత్‌మార్కెట్‌లో దీని ధర రూ.7,496 మాత్రమే.

### క్లిప్ ఉంటే మీ సైకిల్ ఇక ఈ-సైకిల్

ప్రపంచవ్యాప్తంగా ఇటీవలి కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం బాగా పెరిగింది. ఈ-స్కూటర్లు, బైక్‌లే కాకుండా, ఈ-సైకిళ్లు కూడా వాడుకలోకి వచ్చాయి. మామూలు సైకిల్‌ను నడిపించాలంటే, పెడల్ తొక్కక తప్పదు. బలం ఉపయోగించక తప్పదు. ఎగుడు దిగుడు దారుల్లో ఎక్కువ దూరం సైకిల్ మీద వెళ్లాలంటే, అలసట తప్పదు. ఇక అలాంటి ఇబ్బందేమీ ఉండదు. ఈ 'క్లిప్' సైకిల్ ముందు చక్రం వైపు తగిలిస్తే చాలు, మామూలు సైకిల్ కూడా ఈ-సైకిల్‌గా మారిపోతుంది. ఇది ఎలక్ట్రిక్ మోటార్ క్లిప్ ఇది 26 అంగుళాలు, 28 అంగుళాల టైర్లకు సరిపోతుంది. దీనిలోని స్ప్రింగ్‌లోడెడ్ క్లాంప్‌ను ముందు చక్రం ఫోర్స్‌కు తగిలించుకుంటే, గట్టిగా పట్టి ఉంటుంది. ఇందులోని లిథియం అయాన్ బ్యాటరీ ద్వారా సరఫరా అయ్యే విద్యుత్‌తో మామూలు సైకిల్ కూడా ఇట్టే ఇ-సైకిల్‌గా మారి, గంటకు గరిష్టంగా 25 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీస్తుంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# కాఫీ, టీలతో నిద్రాభంగమా!

డాక్టర్ చిట్యాల రవీందర్

**కాఫీ,** టీ, నిద్ర మధ్య ఉన్న సంబంధం గురించి తెలుసుకోవడం చాలా ఆసక్తికరం. ఈ పానీయాలు నిత్యజీవితంలో ఎక్కువగా ఉపయోగించే ద్రావకాలు. అయితే వీటి ప్రభావం చాలా వైవిధ్యంగా ఉంటాయి. కాఫీ, టీని తీసుకోవడం ద్వారా నిద్రకు భంగం కలిగిస్తుందా, లేదా ఇది ఎంతవరకు నిజమో, వివరంగా తెలుసు కుందాం. కాఫీ, టీ వంటి పానీయాలలో ప్రధాన సమ్మేళనం కేఫిన్. ఇది ఒక సర్వసాధార ణమైన స్టిమ్యూలెంట్, దేహంలో ఉన్న సెంట్రల్ నర్వస్ సిస్టమ్‌ను ఉత్తేజపరుస్తుంది. కేఫిన్ తీసుకున్నప్పుడు, అది సెంట్రల్ నర్వస్ సిస్టమ్‌మీద ప్రభావం చూపించి, మేధస్సును తాత్కాలి కంగా అలెర్ట్ స్థితిలో ఉంచుతుంది. ప్రత్యేకంగా ఉదయం కాఫీ లేదా టీ తీసుకోవడం మనకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది.



## ఆరోగ్యం మీద ప్రభావం

సాధారణంగా రోజుకు 400 మిల్లీగ్రాముల కేఫిన్ (సుమారు నాలుగు కప్పుల కాఫీ) తీసుకోవడం సురక్షితమని పరిశోధనలు సూచిస్తున్నాయి. కానీ, ఎక్కువ మోతాదులో కేఫిన్ తీసుకోవడం నిద్రలేమికి దారితీస్తుంది. కాఫీ, టీ,నిద్రపై ప్రభావాన్ని గమనిస్తే మన శరీరంలో కేఫిన్ 4-6 గంటల వరకు పనిచేస్తుంది. అంటే మీరు సాయంత్రం 5గంటలకి కాఫీ తీసుకుంటే అది రాత్రి 10వరకు మీ నిద్రను భంగం కలిగించగలదు. కేఫిన్ మెదడు లోని కొన్ని రిసెప్టర్లను బంధించటం ద్వారా, ఆ రిసెప్టర్లు అడెనోసిన్ అనే రసాయనాన్ని తీసుకోలేవు. ఆ రసాయనం మనకు నిద్రపోయేలా చేస్తుంది. అయితే కొంతమంది వ్యక్తులకు కేఫిన్ మీద అధిక సున్నితత్వం ఉంటుంది. వారికి ఒక కప్పు కాఫీ కూడా రాత్రి నిద్రకు ఆటంకం కలిగించవచ్చు. కాబట్టి, వారి నిద్రపూట కేఫిన్ తీసుకోకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు.

నిద్రను ప్రోత్సహించే కొన్ని రకాల టీలు (ఉదా: కెమామైల్, పెప్పర్మింట్) నిజానికి నిద్రను ప్రోత్సహిస్తాయి. ఇవి కేఫిన్ లేకుండా ఉండటంతో పాటు, రాత్రి సమయంలో తీసుకుంటే నిద్రకు సాయం చేస్తాయి. గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ కూడా కేఫిన్ కలిగి ఉంటాయి. కానీ కాఫీతో పోలిస్తే తక్కువ మోతాదులో ఉంటుంది. అయినప్పటికీ, రాత్రి సమయంలో వీటిని తీసుకుంటే నిద్రకు ప్రభావం కలిగించే అవకాశం ఉంది.

## పరిశోధన ఫలితాలు

బహుళ అధ్యయనాలు కాఫీ, టీ నిద్ర మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించాయి. కొంతమంది వ్యక్తులు కేఫిన్ తీసుకున్నప్పటికీ, నిద్రపోవడంలో సమస్యలు ఎదుర్కోవడం లేదు. కానీ, ఇతరులకు మాత్రం ఇది గాఢనిద్రను తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఉదాహరణకు, ఇది మూడ్‌ను మెరుగు పరచగలదు. కానీ అధికంగా తీసుకుంటే, అది ఆందోళనను పెంచవచ్చు. దానివల్ల నిద్రకు మరింత భంగం కలుగుతుంది.

**నిర్ధారణ:** కాఫీ, టీ మన నిద్రకు ప్రభావం చూపుతాయని చాలా పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే, ఇది వ్యక్తిగత అనుభవం, తాగే సమయం మీద ఆధారపడి ఉంటుంది. కనుక, రాత్రి సమయానికల్లా కాఫీ కేఫిన్ ఉన్న పానీయాలను తగ్గించడం లేదా నివారించడం, మంచినిద్ర పొందడానికి ఉపయోగపడుతుంది. ఇక ప్రత్యేకించి నిద్ర కోసం టీలను (కెమామైల్‌వంటి) ఎంచుకోవడం ద్వారా మీరు రాత్రి సమయానికల్లా ప్రశాంతంగా నిద్ర పొందగలరు. మొత్తంగా కాఫీ, టీ నిద్ర మధ్య ఉన్న సంబంధం ప్రతి ఒక్కరికి వేరుగా ఉంటుంది.

మీరు కేఫిన్ మీద మీ శరీరం ఎలా స్పందిస్తుందో అవగాహన కలిగి, అవసరమైన మార్పులే చేసుకోవడం ద్వారా మీ నిద్ర మెరుగుపరచుకోవచ్చు. ఈ విధంగా, కాఫీ, టీ నిద్రకు భంగం కలిగిస్తాయా అనే ప్రశ్నకు సమాధానాలు అనేకం ఉన్నాయి. కానీ వాటి ప్రభావాలు పూర్తిగా వ్యక్తిగత అనుభవాలు, కేఫిన్ తీసుకునే సమయంపై ఆధారపడి ఉంటాయి. ●



'సంఘీ' భావం



# పోలవరానికి పకడ్బందీ ప్రణాళిక

ఎట్టకేలకు పోలవరం నిర్మాణానికి కేంద్రం పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేసింది. భారీగా నిధులు అందించేందుకు ఆమోదం తెలిపిన కేంద్ర జలశక్తి శాఖ తొలిసారిగా అడ్వాన్స్ నిధులు ఇవ్వడంతో పాటు వీటి ఖర్చుకు కొన్ని నిబంధనలను పేర్కొంది. దశలవారీగా నిర్మాణం పూర్తి చేయడానికి ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయడంతో పాటు అవి సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకుంది. ఈ నిధులు అవసరానికి ఇతర కార్యక్రమాలకు ఉపయోగించకుండా కట్టడి చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పోలవరం నిర్మాణానికి శంకుస్థాపన జరిగినప్పటి నుంచీ ప్రతిసారీ ఏదో ఒక అవరోధం రావడం నిర్మాణం జాప్యం కావడం జరుగుతోంది. తరచూ నిర్మాణ సంస్థలను మార్చడం, ఈ ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు ఇతర పద్దులకు బదిలీ చేయడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి నిధుల విడుదల సమయంలో కేంద్రం తగిన జాగ్రత్తలు తీసుకుంది. ప్రస్తుతం మొదటి విడతగా 2,348 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుతం ఇచ్చిన నిధులను 75 శాతం ఖర్చు చేసి, పూర్తి వివరాలతో లెక్కలు అప్పగిస్తేనే తదుపరి విడత నిధులు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేసింది. దీనితో ఈ నిధులను త్వరితగతిన ప్రాజెక్ట్ నిర్మాణానికి ఖర్చు చేసే అవకాశం కలుగుతుంది. ఈ నిధులను నిర్దేశించిన ప్రకారం సకాలంలో ఖర్చు చేయాలి. ఒకవేళ అనుకోకుండా అవాంతరం ఏర్పడి నిధులు ఖర్చు చేయలేకపోతే అందుకు స్పష్టమైన కారణాలు పేర్కొనాల్సి ఉంటుంది. అదేవిధంగా వివిధ శాఖలతో సమన్వయం, పర్యవేక్షణ, సత్వర నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా ఒక సమన్వయ కమిటీని ఏర్పాటుచేస్తారు. ప్రాజెక్టుకు ఖర్చు చేసే నిధుల వివరాలు కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ ఆఫ్ జనరల్ (కాగ్) అధికారులకు అందుబాటులో ఉంచాలి. ఎక్కడైనా తప్పిదాలు జరిగినా, నిబంధనలు అతిక్రమించినా కాగ్ వాటిని కేంద్రానికి నివేదికను ఇస్తుంది. పోలవరం నిర్మాణం సుమారు రెండు దశాబ్దాల ముందే పూర్తి కావల్సి ఉంది. అనేక ప్రయోజనాలు కలిగిన ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి అయితే విద్యుత్, వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభాన్ని నివారించే అవకాశం ఉంటుంది. అయితే ఈ నిర్మాణం రాజకీయాలతో ముడిపడి ఉండటంతో ఒక అడుగు ముందుకు మూడు అడుగులు వెనక్కు అన్న విధంగా తయారైంది. ముఖ్యంగా పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాలతో సరిహద్దు వివాదం నెలకొంది. అదేవిధంగా ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతం అటవీ పరిధిలోకి రావడంతో అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఈ కారణాల వల్ల అనుకున్న మేరకు ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగలేదు. దీనితో ఎప్పటికప్పుడు నిర్మాణ వ్యయం పెరుగుతూ వస్తోంది. మొదటి డిపిఆర్ కంటే 12 వేల 157 కోట్ల రూపాయలు అదనంగా రెండవ డిపిఆర్‌ను ఆమోదించారు. ఈ మేరకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఆరువేల కోట్లకుగాను ప్రస్తుతం అడ్వాన్స్ నిధులు విడుదల చేసింది. 1941లో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రెండు పంటల సీజన్‌లలో సుమారు మూడు లక్షల 50 వేల ఎకరాల సాగుచేయడమే కాకుండా 40 మెగావాట్ల జల విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. కేవలం 129 కోట్ల రూపాయలతో ప్రాజెక్ట్ నిర్మించడానికి వీలుగా అంచనాలు రూపొందించారు. 1980లో ఒక సారి అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య శంకుస్థాపన చేయగా, 2004లో మరోసారి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సుమారు 8 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి భూమి పూజలు చేశారు. ఆయన హయాంలో ప్రాజెక్ట్ పనులు ఊపందుకున్నా ఆశించిన లక్ష్యాలను మాత్రం చేరలేక పోయింది. 2014లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి హోదాలో ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను విభజిత ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేస్తూ ఆర్డినెన్స్ తీసుకువచ్చారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీని కేంద్రం ఏర్పాటుచేసింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి భూసేకరణలో తీవ్రజాప్యం జరుగుతూ వచ్చింది. 2018లో ప్రాజెక్ట్ స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఫిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనుల కోసం నవయుగ ఇంజనీరింగ్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. 2019 జనవరిలో కేవలం 24 గంటల్లో 32,100 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేయడం ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానం సంపాదించింది. ఆ తరువాత జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాంట్రాక్ట్ సంస్థను మార్పు చేశారు. మళ్లీ 2024లో జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో చంద్రబాబు నాయుడు సిఎంగా బాధ్యతలు స్వీకరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో పొత్తు ఉండటంతో త్వరితంగా నిధులు రాబట్టి నిర్మాణం పూర్తి చేయాలని పావులు కదుపుతున్నారు. దీనికి అనుగుణంగానే ఇటీవల 2,348కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పేర్కొన్న నిబంధనలు స్పష్టంగా ఉండటంతో కేవలం ఈ నిధులు పోలవరం నిర్మాణానికి మాత్రమే ఉపయోగించే వీలు ఉంది. అదేవిధంగా 75 శాతం నిధులు ఖర్చు చేసిన వెంటనే రెండవ విడత నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర జలశక్తిశాఖ స్పష్టం చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ప్రస్తుతం పూర్తి స్థాయి సమన్వయం ఉండటం వల్ల పోలవరం ఆశించిన మేరకు త్వరగానే పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.


– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# భారతీయ రతన్ టాటా

**కవర్ స్టోరీ**

**వరిగొండ కాశీ విశ్వేశ్వరరావు**

**మానవతావాదం, దాతృత్వం, వ్యాపార దృష్టి, పరోపకారం, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా ఉండే తత్వం వంటి నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకున్న వారెవరైనా ఉన్నారంటే..ఆయనే రతన్‌టాటా! రతన్ టాటాల సామ్రాజ్యాన్ని బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లిన ఘనత రతన్ టాటా దక్కించుకున్నారు. ఆయన అజాత శత్రువుగా పేరుగాంచారు.**



ఉప్పు నుంచి ఉక్కు వరకు ఆయన స్పృశించని వ్యాపార వస్తువేదీ లేదు. కాదేదీ వ్యాపారానికనర్హమంటూ ఆయన ఉత్పత్తి చేస్తున్న వస్తువులను బట్టి లెక్కించవచ్చు. ఏ రంగంలో అడుగిడినా దాని అంతు చూడకుండా వదలని ఒకేఒక వ్యక్తి రతన్ టాటా. అందుకే వ్యాపారాల్లో ప్రవేశించే వారెవరైనా ఉంటే వారు రతన్ టాటాను స్ఫూర్తిగా తీసుకోవాల్సిందే. భారతదేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి 'రతన్ టాటా'. టాటా ఫ్యామిలీ సమాజం కోసమే సంపదను సృష్టించి సమాజ శ్రేయస్సుకే వినియోగిస్తుందని మంచి పేరు తెచ్చి పెట్టారు. రతన్ టాటా వృద్ధాప్య సమస్యల కారణంగా గత కొంతకాలంగా ఆయన వైద్యచికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన ఈ లోకాన్ని వీడి వెళ్లిపోయారు. పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణం భారతీయులను కలచివేస్తోంది. 'నేషన్ ఫస్ట్' అని నమ్మిన ఆయన, తన సంస్థనే కాకుండా పారిశ్రామిక రంగంలో దేశాన్ని ఉన్నత స్థానాలకు తీసుకెళ్లారు. టాటా గ్రూప్ లాభాల్లో 60-65శాతం నిధులను దాతృత్వానికే వెచ్చించారు. లేదంటే ప్రపంచ అత్యంత సంపన్నుల జాబితాలో ఆయన తొలి వరుసలో ఉండేవారు. కానీ అవేమీ లెక్కచేయని గొప్ప మానవతావాది. ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు.

జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిన పారిశ్రామికవేత్త, ఛైర్మన్ ఎమెరిటస్ ఆఫ్ టాటాసన్స్..రతన్ నావల్ టాటా. 1991 సంవత్సరంలో రతన్ టాటా గ్రూప్ ఛైర్మన్ అయ్యారు. ఆయన ఎప్పుడూ దేశానికి తొలి ప్రాధ్యానం ఇచ్చేవారు. బాధ్యతలు స్వీకరించిన సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.10వేల కోట్లుగా ఉంది. తర్వాత అంతర్జాతీయ స్థాయిలో టాటా గ్రూపును కొనసాగిస్తూ చేపట్టిన సంస్కరణలతో పదవి నుంచి దిగిపోయే సరికి రెవెన్యూను రూ.లక్ష కోట్లకు చేర్చారు. భారతదేశంలో అత్యంత గౌరవనీయమైన పారిశ్రామికవేత్తలలో రతన్ టాటా ఒకరు. ఆయన నాయకత్వంలో టాటా గ్రూప్ అనేక ముఖ్యమైన విజయాలను సాధించింది. సంస్థలకు కార్లు తయారు చేసే సత్తా లేదన్న అపప్రథకు 'ఇండికా'కారు తయారీతో అడ్డుకట్ట వేశారు. విలువలతో కూడిన వ్యాపారానికి చిరునామాగా నిలిచిన మహానీయుడాయన. వంటగదిలో వాడుకొనే ఉప్పు నుంచి విమానం దాకా ఆకాశమే హద్దుగా విస్తరించిన వాణిజ్య విశ్వరూపం.

## రతన్ టాటా బాల్యం

1937లో డిసెంబరు 28న ముంబైలో పార్సీ జొరాస్ట్రియన్ కుటుంబంలో రతన్ టాటా జన్మించారు. ఆయన సూరత్‌లో నావల్ టాటా, జమ్‌సెట్‌జీ మేనకోడలు సోనీ టాటాలకు జన్మించారు. 1948లో రతన్ టాటాకు 10ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు ఆయన తల్లిదండ్రులు విడిపోయారు. ఆ తరువాత టాటా అమ్మమ్మ, నవాజ్‌బాయి టాటా ఆయన్ను దత్తత తీసుకున్నారు. నాయనమ్మ పెంపకంలో ఆయన పెరిగారు.

రతన్ విద్యాభ్యాసం తన ఉన్నత చదువును అమెరికాలోనే పూర్తి చేసుకొని జె.ఆర్.డి.టాటా పిలుపు మేరకు జంషెడ్‌పూర్‌లోని టాటా స్టీల్ కంపెనీలో అప్రెంటీస్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు రతన్. ఎప్పటికప్పుడు కొత్తకొత్త ఆలోచనలతో, తన నైపుణ్యంతో టాటా కంపెనీలో ఒక ఉత్తమ ఉద్యోగిగా ఎదిగారు రతన్.





ఆ విధంగా కొన్ని సంవత్సరాలు ఉద్యోగిగా పనిచేసిన తరువాత 1991లో జెఆర్‌డి టాటా నుండి టాటా గ్రూప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో ఈ నిర్ణయాన్ని బోర్డు ఆఫ్ మెంబర్స్‌లో చాలామంది వ్యతిరేకించారు. అనుభవం లేని రతన్ చేతిలో ఇన్ని వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యం నడవలేదని అందరు వాదించారు. అనుభవలేమితో కెరీర్ ప్రారంభంలో రతన్ టాటా అనేక విమర్శలను ఎదుర్కొన్నారు. వాటినే సోపానాలుగా మలచుకొని చైర్మన్ అయ్యాక తనదైన నిర్ణయాలతో ప్రపంచవ్యాప్తంగా టాటా గ్రూపుల్ని విస్తరించారు. లండన్ టెట్లీ టీ కొనుగోలు, కార్ల తయారీ సంస్థలు జాగ్వార్, ల్యాండ్ రోవర్తో పాటు కోరస్ స్టీల్‌ను టాటాలో భాగం చేశారు. దీంతోపాటు ఐటీ, టెలి కమ్యూనికేషన్స్, ఆటో మొబైల్స్ రంగాల్లోనూ సంస్థను విస్తృతం చేసి సక్సెస్ అయ్యారు. దాదాపు ఏడు లక్షల మందికి ఉపాధినిస్తూ, నూటయాభై ఏళ్ల చరిత్ర కలిగిన టాటా గ్రూప్‌ను అందనంత ఎత్తులో నిలబడేలా చేశారు. నేడు ఉప్పు నుండి ఉక్కు వరకు, టీ నుండి ట్రక్కుల వరకు... ఇలా ప్రతి వ్యాపారంలోనూ ఖచ్చితంగా టాటా పేరు వినిపిస్తుంది. ఇంతటి ఘన చరిత్రను టాటా గ్రూప్‌కు కట్టబెట్టేలా చేసిన మేటి అతనే రతన్ టాటా. విలువలతో కూడిన వ్యాపారమంటే ముందుగా గుర్తొచ్చేది రతన్ టాటా. గ్రూపులో నష్టాల్లో ఉన్న కంపెనీని వదిలించుకుందామని బోర్డు మెంబర్స్ అంటే ఆయన ఒప్పుకొనేవారే కాదు. దానిపై ఆధారపడి బతికే ఉద్యోగుల జీవితాల గురించే ఆలోచించేవారు. ఆ కంపెనీని కాకుండా మొత్తం గ్రూపుల్ని ఒక యూనిట్‌గా తీసుకునేవారు.

సైరస్ మిస్త్రీ టాటా సన్స్ బాధ్యతలు చేపట్టాక మెట్ కంపెనీలను అమ్మేద్దామంటే అస్సలు ఒప్పుకోలేదు. చాలా అంశాల్లో విభేదించారు. 'టాటా' ఫ్యామిలీ దేశంలోనే మొదటి స్టీల్‌ప్లాంట్. ఫైవ్‌స్టార్ హోటల్, పవర్‌ప్లాంట్, సాఫ్ట్‌వేర్ కంపెనీ, కార్ల తయారీ సంస్థ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ఇలా ఎన్నో ప్రారంభించారు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. రతన్ ఆజన్మాంతరం బ్రహ్మచారిగానే ఉన్నారు. అంచెలంచెలుగా ఎదిగి 1991-2012 వరకు టాటా గ్రూప్ చైర్మన్‌గా ఉన్నారు. తన నాయకత్వంలో టాటా గ్రూపులో అనేక సంస్కరణలు చేపట్టారు. 1991లో



టాటా గ్రూప్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేడు టాటా గ్రూప్ 100కి పైగా దేశాలలో విస్తరించి వందకుపైగా వ్యాపారాలలో తన ముద్రను వేసి, దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అత్యుత్తమ కంపెనీలలో ఒకటిగా నిలబెట్టిన ఘనత రతన్ టాటాదే. దక్షిణ కొరియాకు చెందిన దేవూ మోటార్స్ ట్రక్కుల తయారీ యూనిట్‌ను 102 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. ఆంగ్లో-డచ్ కంపెనీ కోరస్ గ్రూప్‌ను 11.3 బిలియన్ డాలర్లకు స్వాధీనం చేసుకుంది. టాటా టీ ద్వారా టెట్లీ, టాటా మోటార్స్ ద్వారా జాగ్వార్‌ల్యాండ్ రోవర్, టాటా స్టీల్ ద్వారా కోరస్‌తో సహా ఈ కొనుగోళ్ల టాటా గ్రూప్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలా చేశాయి. దాదాపు 100 దేశాలకుపైగా టాటా కంపెనీ వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. భారతీయ పారిశ్రామిక రంగంలో కూడా ఎంతో ప్రోత్సాహాన్ని అందించింది.

## సంక్షోభ సమయంలో నేనున్నానంటూ..!

భారత్‌ను వణికించిన ఘటనల్లో ముంబై ఉగ్రదాడి ఒకటి. టాటా గ్రూపునకు చెందిన తాజ్‌హోటల్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో హోటల్ ధ్వంసమైంది. అయినప్పటికీ రతన్ టాటా ముందుండి మరింత దృఢంగా పునర్నిర్మించారు. దాడిలో గాయపడ్డ బాధితులతో పాటు హోటల్ సిబ్బందికి అండగా నిలిచి భరోసానిచ్చారు. కరోనా సమయంలోనూ తనవంతు సాయంగా రూ.1,500 కోట్ల భారీ విరాళం ప్రకటించి దాతృత్వాన్ని చాటుకున్నారు.

తాతల నాడు పోగొట్టుకున్న ఎయిర్ ఇండియా పగ్గాలు చేతికి! టాటా గ్రూప్ భారతదేశానికి ఎన్నో కొత్తకొత్త వ్యాపారాలను పరిచయం చేసింది. నేడు ఎయిర్ ఇండియాగా పిలవబడుతున్న విమానయాన సంస్థను మొదటి టాటా ఎయిర్‌లైన్స్ పేరుతో 1868లో జంషెడ్ జీ టాటా స్థాపించారు. కాలక్రమంలో అది కాస్తా ప్రభుత్వం చేతిలోకి వెళ్లింది.

అలాగే భారతదేశంలో మొట్టమొదటి హోటల్ అయిన తాజ్‌హోటల్‌ను ప్రారంభించింది కూడా టాటాలే. బ్రిటన్‌కు చెందిన టెట్లీ టీ అనే కంపెనీని 431.3 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. టాటా టీలో కలుపుకొని ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద టీ కంపెనీగా టాటా టీ ఎదిగింది. అంతేకాదు మనల్ని పాలించిన బ్రిటిషర్లకే ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదిగాడు రతన్ టాటా. ఎన్నో విదేశీ కంపెనీలను టాటా గ్రూప్‌లో కలుపుకొని టాటాను ఒక మహా సామ్రాజ్యంగా ఎదిగేలా చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు 2008 నవంబరు 26న

తాజ్ హోటల్‌పై జరిపిన ఉగ్రదాడిలో వందలమంది అతిథులను, తమ ఉద్యోగస్థులను పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఈ సంఘటన రతన్‌ను మానసికంగా ఎంతో బాధించింది.

**రతన్ టాటాకు అవమానాలు, అవరోధాలు**

1998లో టాటా ఇండికా కార్లను ప్రవేశపెట్టారు. టాటా ఇండికా పేరుతో తన మొదటి కారు మోడల్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. కాగా టాటా కారును కొనుగోలు చేసేందుకు వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. దురదృష్టవశాత్తు ఆ కార్లు మొదటి సంవత్సరంలోనే ఫెయిల్ అవటంతో రతన్ టాటా ఇండికా కార్ల వ్యాపారాన్ని అమ్మేయాలని భావించారు. ఇందుకోసం అమెరికాలోని ఫోర్డ్ కంపెనీకి తన టీంతోపాటు రతన్ టాటా కూడా వెళ్లారు. అయితే ఫోర్డ్ కంపెనీ ఛైర్మన్, రతన్ టాటాను మీకు కార్లు ఎలా తయారు చేయాలో తెలియనప్పుడు కార్ల బిజినెస్ ఎందుకు స్టార్ట్ చేశారు? అని అవమానించారు. ఈ సంఘటనతో ఆ డీల్ మాట్లాడకుండానే వెనుదిరిగి వచ్చేసారు. కొన్ని సంవత్సరాల తరువాత 'టాటా ఇండికా' నష్టాల నుండి లాభాలలోకి రావటం మొదలు పెట్టింది. అదే సమయంలో ఫోర్డ్ కంపెనీకి చెందిన జాగ్వార్, ల్యాండ్రోవర్ కార్లు భారీగా నష్టాల్లోకి వెళ్లిపోయాయి. ఆ సమయంలోనే రతన్ ఆ రెండు కంపెనీలను తానే దక్కించుకోవాలని ఫోర్డ్ కంపెనీకి ఆఫర్ చేశారు రతన్. అప్పుడు ఫోర్డ్ కంపెనీ ఛైర్మన్ తన టీంతో అమెరికా నుండి ముంబైకు వచ్చారు. ఆ విధంగా తనను అవమానించిన వారికే గుణపాఠం చెప్పారు రతన్.

భారత ఆటోమొబైల్ నష్టాల్లో ఉన్న బ్రిటన్ కంపెనీలు జాగ్వార్, లాండ్‌రోవర్‌లను కొని లాభాలబాటలోకి నడిపించిన నాయకుడు. 2008లో జాగ్వార్-ల్యాండ్ రోవర్ యూనిట్‌ను కొనుగోలు చేయడంతో ఫోర్డ్‌ను దివాలా నుంచి రక్షించారు. తనను అవమానించిన వారినే చేయూతనిచ్చి ఆదరించారయన. ఇందుకోసం టాటా కూడా రూ.2500 కోట్ల నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది.

**'ఇండికా' (టాటా ఇండికా) కారంటే మహాప్రీతి!**

ఎన్నో ఖరీదైన కార్ల తన కంపెనీ అందుబాటులోకి తెచ్చినప్పటికి రతన్ టాటాకు మాత్రం టాటా మోటార్స్ రూపొందించిన 'ఇండికా' కారునే ఎక్కువగా ఇష్టపడతారు. ఈ విషయాన్ని రతన్ టాటానే స్వయంగా ఓ సందర్భంలో చెప్పారు. ఇండికా కారుపై తనకున్న ప్రేమను చాటుతూ గతంలో (గతేడాది జనవరిలో) ఓ పోస్టు పెట్టారు. ఆ కారు పక్కన నిల్చుని ఉన్న ఫోటోను షేర్ చేస్తూ '25 సంవత్సరాల క్రితం టాటా ఇండికాను ప్రారంభించడంతో భారతదేశ స్వదేశీ ప్యాసింజర్ కార్ల పరిశ్రమకు పునాది పడింది. ఇది మధురమైన జ్ఞాపకాలను నాకు ఎప్పుడూ గుర్తు చేస్తుంది. ఈ కారుకు నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంది" అంటూ రాసుకొచ్చారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో రతన్ టాటా



రతన్ టాటాకు పాదాభివందనం చేస్తున్న ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి

**రతన్ టాటా వ్యక్తిగత జీవితం**

లాస్ ఏంజిల్స్‌లో ఉండగా దాదాపు ప్రేమ, పెళ్లి వ్యవహారం వరకు వెళ్లింది. కానీ, దురదృష్టవశాత్తు రతన్ టాటా అమ్మమ్మ ఆరోగ్యం క్షీణించడంతో ఆయన భారత్‌కు రావలసి వచ్చింది. లాస్ ఏంజెల్స్‌లో ఉన్నప్పుడు ప్రేమలో పడిన అమ్మాయిని అప్పట్లో 1962 ఇండో-చైనా యుద్ధం కారణంగా ఆమె తల్లిదండ్రులు ఇండియాకు పంపించేందుకు అంగీకరించలేదు. ఇండో-చైనా యుద్ధం కారణంగా భారత్‌లో నెలకొన్న అస్థిరత కారణంగా ఆమె తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో 'లవ్ మ్యారేజ్'కు బ్రేక్ పడిందని తెలిపారు. అక్కడితో వారిద్దరి అనుబంధం ముగిసింది. ఆ తర్వాత అలనాటి బాలీవుడ్ నటి 'సిమి గరేవాల్' ఆయన్ను ఆరాధించినా అది ముందుకు సాగలేదు.

**టాటా నానో అరంగేట్రం**

2015లో రతన్ టాటా 'టాటా నానో' కారును ప్రవేశపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా మధ్య, దిగువ, మధ్య ఆదాయ వినియోగదారులకు అత్యంత సరసమైనదిగా మారింది. ఐదుగురు కూర్చునే సామర్థ్యం కలిగిన ఈ కారు ప్రారంభ ధర 2 వేల డాలర్లు. టాటా నానో అనేది స్థోమత పరంగా సామాన్యుల కారుగా పేరు గాంచింది. కారులో ప్రయాణించాలనే భారతీయ మధ్య తరగతి కుటుంబాల కలను నానో కారు ద్వారా నెరవేర్చిన దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా స్కూటర్లపై పిల్లలు తల్లిదండ్రుల మధ్యలో



# రతన్ టాటా అందుకున్న పురస్కారాలు

రతన్ టాటా తన జీవిత కాలంలో స్వదేశంతో పాటు ఇతర దేశాల్లోనూ అనేక గౌరవ పురస్కారాలను అందుకున్నారు. రతన్ టాటాకు 2008లో భారత రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్, 2000లో మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మభూషణ్ లభించాయి. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కేంబ్రిడ్జి యూనివర్సిటీ, ఒహియో స్టేట్ యూనివర్సిటీ, ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్ ఐఐటి ఖరగ్‌పూర్‌తో సహా పలు ప్రతిష్టాత్మక సంస్థల నుంచి గౌరవ డాక్టరేట్‌లను కూడా అందుకున్నారు. ఓరియంటల్ రిపబ్లిక్ ఆఫ్ ఉరుగ్వే మెడల్, అంతర్జాతీయ విశిష్ట సాఫల్య పురస్కారం, ఆర్డర్ ఆఫ్ మెరిట్ ఆఫ్ ది ఇటాలియన్ రిపబ్లిక్ గ్రాండ్ ఆఫీసర్ అవార్డు, నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్(యుకె), ఓస్లో బిజినెస్ ఫర్ పీస్ అవార్డు వంటి అవార్డులు, అనేక డాక్టరేట్లు తన ఖాతాలో ఉన్నాయి.



తన ప్రతిభను మెచ్చి పలు దేశాలలోని యూనివర్సిటీలు తనను గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అంతేకాదు, భారత ప్రభుత్వం పద్మభూషణ్, పద్మవిభూషణ్‌లతో రతన్‌ను గౌరవించింది. కోట్ల అధిపతి అయినా ఏనాడూ ఇసుమంత గర్వాన్ని కూడా ప్రదర్శించలేదు రతన్ టాటా. 86 యేళ్ల వయసులోనూ సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటూ కోట్ల మంది భారతీయుల హృదయాలను గెలుచుకున్నాడు రతన్. ఇప్పుడు రతన్ టాటా అంటే ఒక వ్యక్తి కాదు, ఒక సంస్థ, ఒక బ్రాండ్. వీటన్నిటికీ మించి సృజనాత్మకత, దార్శనికత ఉన్న ఒక గొప్ప మానవతావాది. నేడు 130 కోట్ల మంది భారతీయులు మనసారా సగర్వంగా ఇతడు మా భారతీయుడు అని చెప్పుకునే వారిలో ముందు వరుసలో ఉంటారు రతన్ టాటా. అతని జీవన ప్రయాణం మనకీ స్ఫూర్తిదాయకం.



నలిగిపోతున్నారేమోనని భావించి ఈ కారును తయారు చేసినట్లు ఆయన ఓ సందర్భంలో చెప్పారు. నానో ఎప్పటికీ ప్రజల కోసమే అని తెలిపారు. అయితే పలు కారణాలతో ఇది మార్కెట్లో నిలవలేకపోవడంతో కార్ల తయారీని టాటా గ్రూప్ నిలిపివేసింది. ప్రతి మధ్య తరగతి వాడికి సొంతంగా ఒక కారు ఉండాలనే ఉద్దేశంతో ఒక లక్ష రూపాయలకే టాటా నానో కారును మార్కెట్లోకి తెచ్చి పెనుసంచలనాన్నే సృష్టించాడు రతన్.

## ఎన్నో సవాళ్లు ఎదురైనా..!

రతన్ టాటా కెరీర్‌లో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. ఎన్ని సవాళ్ల ఎదురైనా అలానే ముందుకు సాగి ఎన్నో విజయాలను అందుకున్నారు. కోర్ మేనేజ్‌మెంట్ నుంచి రూ.50 లక్షల నిధులను మంజూరు చేయకపోవడంతో 1977లో ఎంప్రెస్ మిల్ యూనిట్‌ను రతన్ టాటా మూసేయాల్సి వచ్చింది. ఆ యూనిట్ విప్లవాత్మకంగా ఉండాలని ఆయన కలలు కన్నారు. కానీ, దురదృష్టవశాత్తు రతన్ నిరాశకు గురి చేసింది. 1981లో జెఆర్డీ టాటాచే టాటా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ తదుపరి వారసుడిగా ప్రకటించారు. అప్పుడు కూడా రతన్ టాటా అనేక విమర్శలను ఎదుర్కొన్నారు. ఆపై టాటా గ్రూప్స్ ఉద్యోగులు, పెట్టుబడిదారులు, వాటాదారులతో పాటు అందరూ ఆయన్ను విశ్వసించారు.

..........

"నీ నిష్క్రమణలో మన స్నేహంలో ఏర్పడిన లోతు ఎన్నటికీ తీరనిది. నా మిగిలిన జీవితం మొత్తం ఆ లోటును భర్తీ చేసుకోడానికి ప్రయత్నిస్తా.
గుడ్ బై మై డియర్ లైట్ హౌస్"

## యువ స్నేహితుడు శంతన్



ఈ కుర్రాడెవరు? ఇతనికి రతన్ టాటాకు స్నేహమెలా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. దాదాపు పదేళ్ల క్రితం వీరిద్దరినీ మూగజీవాలు కలిపాయి. దేశం గర్వించదగిన బిలియనీర్ బిజినెస్ మెన్ కూడా. మూగజీవాల పట్ల ప్రేమ అధికం. వీధికుక్కల పట్ల శంతన్ చూపుతున్న శ్రద్ధ వీరిద్దరినీ ఒక్కటి చేసింది. 2018లో వాళ్లిద్దరూ అలా కలిసినప్పటి నుంచి రతన్ టాటాకు శంతన్ అంటే ఎనలేని అభిమానం. రతన్ టాటాకు అతనే అసిస్టెంట్. శంతన్ టాటా ట్రస్ట్‌లో యంగెస్ట్ జనరల్ మేనేజర్ హోదాలో పని చేస్తున్నాడు.
రతన్ తను పెంచుకునే కుక్కలను కూడా వదిలి ఎక్కడికీ ఒంటరిగా వెళ్లలేరని చెబుతుంటారు. ఒకప్పుడు ప్రిన్స్ చార్లెస్

రతన్ టాటాను అభినందించి సత్కరించేందుకు పిలిచారట. కానీ "నా కుక్కలను వదిలి రావడం సాధ్యమయ్యే పని కాదని" చెప్పడంతో రతన్‌ను ప్రిన్స్ ఎంతగానో గౌరవంతో అభిమానించారని చెబుతారు.

........

**వీడ్కోలు నేస్తమా!**

నువ్వు లేవనే బాధనే భరించలేను సుమా!

**- మాజీ ప్రేయసి ఎమోషనల్ ట్వీట్**



ఈ మాటలన్నది ఎవరో కాదు. రతన్ టాటా అభిమానం కూడగట్టుకుని కూడా చేరువ కాలేకపోయిన ఆయన ప్రేయసి, అలనాటి బాలీవుడ్ నటి సిమి గరేవాల్.

రంతన్‌తో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ "ఇక నువ్వు లేవని వినడమే భరించలేనిదంటూ" వీడ్కోలు నేస్తమా! అని ఆమె ట్వీట్ చేశారు.

రతన్ టాటాతో తాను డేటింగ్ చేసానని, ఆ తర్వాత ఇద్దరం విడిపోయామని ఆమె 2011లో ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయం విదితమే.

.........

## శ్రీ సత్యసాయి బాబాతో రతన్ టాటాకు అనుబంధం



టాటా గ్రూప్స్ గౌరవ చైర్మన్, ప్రముఖ దిగ్గజ వ్యాపారవేత్త రతన్ టాటా శ్రీ సత్యసాయిబాబా భక్తుడు. పలుమార్లు ఆయన పుట్టపర్తికి వచ్చారు. 2009 డిసెంబరు 3న చివరిసారిగా సాయిబాబాను దర్శించుకున్నారు. సత్యసాయిబాబా సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై రతన్ టాటా ఆసక్తి చూపించేవారు. రతన్ టాటాకు ప్రశాంతి నిలయంతో ప్రత్యేక అనుబంధం ఉంది.

## రతన్ టాటా ఒక గొప్ప దానశీలి

రతన్ టాటా సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్‌ను స్థాపించారు. రతన్ టాటా సంపాదించిన లాభాలలో దాదాపు 60 నుంచి 65 శాతం దాతృత్వ ప్రయోజనాల కోసం విరాళంగా అందించారు. విద్యారంగంలో న్యాయమైన విద్య కోసం అనేక విరాళాలను అందించారు. వైద్య

రంగానికి కూడా తన వంతు కృషిగా అనేక విరాళాలను అందించారు. గ్రామీణ, వ్యవసాయ అభివృద్ధికి కూడా తన వంతు సహకారం అందించారు. 1991లో సర్ రతన్ టాటా ట్రస్ట్ కూడా ఏర్పాటు చేశారు. రతన్ టాటా ఈ ట్రస్ట్ ద్వారా వివిధ రంగాలలో వెనుకబడినవారి సంక్షేమం కోసం సేవలందించారు. సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై రతన్ టాటా ఆసక్తి చూపించేవారు. రతన్ టాటాకు ప్రశాంతి నిలయంతో ప్రత్యేక అనుబంధం ఉంది.

## "ఫోర్బ్స్" జాబితాలో నిలువనిదందుకే!

లక్షల కోట్ల విలువ చేసే కంపెనీలకు అధిపతులైనా టాటా వంశీయులు ఇంతవరకు ఎప్పుడూ ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో నిలవలేదు. ఎందుకంటే టాటా గ్రూప్ నుండి వచ్చే లాభాలలో 66 శాతం టాటా ట్రస్టులకు విరాళంగా ఇవ్వడం జరుగుతుంది. దేశ సామాజిక పరిస్థితులు మెరుగుపరచటానికి టాటా ట్రస్టులు ఎంతగానో కృషి చేస్తున్నాయి. తాజ్ ఉగ్రదాడిలో నష్టపోయినవారికి అన్ని విధాలా సహాయమందించాడు రతన్. బ్రహ్మచారిగా ఉంటూ నలుగురి బాగు కోసం బతుకుతున్న మహనీయుడు రతన్ టాటా.

## 75 ఏళ్ల వయసులో పదవీ విరమణ



రతన్ టాటా డిసెంబరు 28, 2012న 75 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేశారు. ఆయన తర్వాత షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌కు చెందిన సైరస్ మిస్త్రీ బాధ్యతలు చేపట్టారు. అయితే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దాంతో మిస్త్రీని 2016లో ఆయనను ఆ స్థానం నుంచి తొలగించారు. రతన్ టాటా తాత్కాలిక చైర్మన్‌గా పని చేశారు. 2017 జనవరిలో నటరాజన్ చంద్రశేఖరన్ టాటా గ్రూప్ చైర్మన్‌గా, రతన్ టాటా వారసుడిగా నియమితులయ్యారు. ప్రస్తుతం రతన్ టాటా, టాటా ట్రస్ట్స్, టాటా సన్స్‌కి నాయకత్వం వహిస్తున్నారు. జేఆర్డీ టాటా తర్వాత రెండు కంపెనీలకు రెండో అధినేతగా రతన్ టాటా ఉన్నారు.

## రతన్ టాటా చివరి పోస్ట్ ఇదే!

ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా అనారోగ్యంతో కన్ను మూసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన చేసిన లాస్ట్ పోస్ట్ వైరల్ అవుతోంది. మూడు రోజుల క్రితం తన ఆరోగ్యంపై వదంతులు ప్రచారం చేయొద్దని ట్విట్టర్ వేదికగా ఆయన ప్రకటన చేశారు. తాను ఆరోగ్యంగానే ఉన్నానని ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తన గురించి ఆలోచిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. దురదృష్టవశాత్తు పోస్ట్ చేసిన మూడు రోజులకే ఆయన చనిపోయారు.

# అతిరుచులతో రోగాలు

డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి

శారీరక ఆరోగ్యంతోనే మానసిక ఉల్లాసం సిద్ధిస్తుందని మనకు తెలుసు. శారీరక ఆరోగ్య సంరక్షణకు అనేక పద్ధతులను, జీవన విధానాలను అలవర్చుకుంటున్నాం. శారీరక వ్యాయామం, యోగాప్రాణాయామాలను నిత్య దినచర్యల్లో భాగం చేసుకుంటున్నాం. శారీరక మానసిక ఆరోగ్య సిద్ధికి మనం తీసుకునే ఆహారం కూడా ప్రధాన భూమికలను నిర్వహిస్తున్నాయని తెలుసుకోవాలి. నిత్యం పోషకాహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో నిరాహార లేదా ఉపవాసాలను దీక్షగా పాటించడం కూడా అంతకన్న ఉత్తమం. మన ఆరోగ్య సౌభాగ్యాలను కాపాడాలనే సదుద్దేశంతో మన సనాతన ధర్మం దేవుడి పూజలో భాగంగా వారానికి కనీసం ఒక రోజు



ఉపవాసం లేదా నిరాహార దీక్షలో ఉండేలా సూచించింది. బరువు పెరగడం, జీవనశైలి వ్యాధుల బారిన పడడానికి ప్రధాన కారణాలుగా విచక్షణ మరిచి తిండి తినడం, అదుపు తప్పి ఫాస్ట్‌ఫుడ్స్ లేదా జంక్ ఫుడ్స్ తీసుకోవడం లాంటివి దోహదపడుతున్నాయని తెలుసుకోవాలి.

### ఆహారపు అలవాట్లే ఆరోగ్య ప్రదాతలు

బరువును అదుపులో పెట్టుకోవడం, కొవ్వును కరిగించడం, శారీరక ఆరోగ్యానికి పునాదులు వేయడం, ప్రమాదకర ఆహారపు అలవాట్ల లాంటి అంశాల పట్ల అవగాహన కల్పించడానికి మన కర్తవ్యం కావాలి. మూఢనమ్మకాలకు మంగళం పాడుతూ సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యాల పరిరక్షణకు వారానికి ఒకసారి నిరాహార లేదా ఉపవాసాలను పాటించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శరీర సానుకూలత (బాడీ పాసిటివిటి) సూత్రాలు, పరిమిత ఆహారం తీసుకునే నియమాలను పాటించడం మన జీవనశైలిలా భాగం చేసుకోవాలి. 'అసబద్ధ ఆహారపు అలవాట్ల కట్టడితో నిన్ను నువ్వు కాపాడుకోవడం' అనబడే అంశాన్ని గుర్తుంచుకోవాలి. ఉపవాస దీక్షలతో పలు వ్యాధులు కట్టడి చేయబడి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ వేదిక ఉపయుక్తం అవుతున్నది. ప్రతికూల ఆహార అలవాట్లు విషతుల్యమని గ్రహించాలి. విచక్షణారహిత ఆహారపు అలవాట్లు విషతుల్యమని, మనం తీసుకునే ఆహారమే మనకు ఆరోగ్య ప్రదాతలని, కృత్రిమ అందాల వేటలలో అసంబద్ధ ఆహారపు అలవాట్లు చేసుకోవడం లాంటి విషయాలను ప్రజలకు అవగాహన కల్పించాలి. మనం తిన్న ఆహారం మనకు అవసరమైనశక్తిని, చైతన్యాన్ని, పోషకాలని అందించాలి. 'మన ఆరోగ్యం మన చేతుల్లోనే, మన ఆరోగ్యం మన కంచంలోనే' అనే నినాదాలను నిత్యం స్మరణ చేసుకోవాలి. 'పరిపూర్ణ ఆరోగ్య సిద్ధికి పరిమిత సమతుల్య ఆహారం' అనే సూక్తిని సదా గుర్తుంచుకోవాలి. 'నిన్ను నువ్వు ప్రేమించడం అంటే ఏం తినాలి, ఎంత తినాలి, ఎప్పుడు తినాలి' అనే విషయాలను అర్థం చేసుకొని ఆచరించడమే. ఆహారపు అలవాట్లు అదుపు తప్పితే స్థూలకాయం, రోగాలకు ఆహ్వానం, సైజ్ పెరిగి ఆత్మన్యూనతలాంటి అనారోగ్యాలు మనల్ని ఆక్రమిస్తాయి. అసంబద్ధ ఆహారపు రుచులకు లొంగితే మన శరీరం అనారోగ్యాల బారిన పడుతుంది.

### నిరాహార లేదా ఉపవాసాల ప్రయోజనాలు

మన ఇంట్లో పిల్లలకు, యువతకు సరైన ఆహారపు అలవాట్లను అందించడం పెద్దల కనీసం బాధ్యత. అసాధారణ, ప్రతికూల శరీర మార్పులకు పునాది మనం నిత్యం తీసుకునే ఆహారమే అని గమనిస్తూ నిరాహార లేదా ఉపవాస క్రమశిక్షణలు పాటిస్తూ మన ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేసుకుందాం. క్రమశిక్షణతో ఉపవాసాలు పాటిస్తే గ్లూకోజ్ నియంత్రణ, ఇన్సులిన్ అదుపు, జీవక్రియ ఆరోగ్యం, గుండె ఆరోగ్యం, బరువు అదుపు, దీర్ఘాయువు, మెదడు ఆరోగ్యం, వాపులు తగ్గడం, హార్మోన్ నియంత్రణ, బీపీ అదుపు, చెడు కొలెస్టరాల్ స్థాయి తగ్గుదల, ఒత్తిడి నియంత్రణ, వృద్ధాప్య నియంత్రణ, కేన్సర్ కట్టడి, సానుకూల జీర్ణక్రియ, థైరాయిడ్ రుగ్మతల కట్టడి, సరళ సుస్థిర జీవన యాత్రలు లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ఎప్పుడూ తింటేనే కాదు ఉపవాసం ఉంటే కూడా ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలుసుకుందాం. పరిమిత మోతాదులో పోషకాహారం మాత్రమే తీసుకుందాం. క్రమం తప్పకుండా ఉపవాసాలు పాటిస్తూ మన శరీరానికి ఉపశమనం, విశ్రాంతులను బహుకరిద్దాం. ■





ఈవారం కవిత్వం

# పున్నమి వెలుగు

ఒక్క మాట వినెళ్లు..
ఇంకెవరికి చెప్పనూ!
నన్ను నీతో పట్టుకెళ్లిపోయాక
నన్ను నాలో వదిలేసెళ్లాక
నేను నాకు లేకుండా పోయాక
శూన్యమై పోయాను.

అయినా../ నువిచ్చిన ఆలోచన
తట్టుకుని నిలబడే ఓర్పునిచ్చింది

నిన్ను చూస్తూ పెరిగిన
నా ధైర్యం
ఎన్ని ఆటంకాలు ఎదురైనా
పోరాటం ఆపకంది.

చివరి వరకూ
ఎవరికి ఎవరూ మిగలరు
ఎవరికి ఎవరూ ఉండరనే సత్యం
ఎంత తెలిసినా../ ఉన్న అన్ని జ్ఞాపకాల్లో
నాకు నేను లేకుండా పోయాను.
కళ్లనుండీ సముద్రం పోటెత్తినా
తెరపిన పడేదాన్ని.
గుండెల్లో పేరుకున్న దుఃఖతుఫాన్
ఉప్పెనగా మారి నన్ను ముంచేసినా కోలుకునేదాన్ని.

నీ విలువల్ని పుణికి పుచ్చుకుని
నన్ను నీ దగ్గర వొదిలేసుకున్నందుకేమో
కాలాలు కొనసాగుతున్నాయ్
నేను నీ దగ్గర ఆగిపోయా!
కప్పలన్నీ నీ చెరువులోకి చేరితే
అన్నీ తెలిసీ నువ్వూరుకున్నావ్
ఏరు దాటాక
తెప్ప తగలలేస్తారని గ్రహించక
నా అనే మైకంలో..
నేనూ కళ్ల మూసుకునున్నా.
వెన్ను తట్టేందుకు నా వెనుక
నువ్వున్నావనే ధైర్యం
పెదవి మీద ప్రవహిస్తూ ఉంటుంది
నిన్ను దోచుకున్న తోడేళ్లకూ
నన్ను ముంచి గుంటనక్కలకూ
జ్ఞానోదయం ఎన్నటికీ కలగదు.
వాళ్ల భుజాల్ని వాళ్లు తడుముకుంటూ
నా గుండెలకేసి గునపాల్ని విసిరేస్తూ
అమాయకుల్లా ఇంకా మొహానికి మేకతోలు
తొడుగేసుకు తిరగాడుతున్నారు.
పగలు ఉంది
ప్రతీ ఉదయం సూర్యుడు రాకపోవచ్చు.
రాత్రి ఉంది
ప్రతీ రాత్రీ చంద్రుడు కనిపించకపోవచ్చు
నా హృదయంలో ఏ వేళలోనూ
ఎప్పటికీ..
వాళ్లు ఉదయించలేరనే
అసలు సత్యం
నా పెదవిపై పున్నమి వెలుగై పూసింది.

– కె.యామినీ దేవి

# గ్లోబల్ వార్నింగ్



గ్లోబల్ వార్నింగ్/ మండుటెండల్లో వర్షపు బీభత్సాలు
వాతావరణంలో అర్థం కాని
పర్యావరణపు పరిహాసాలు
గ్లోబల్ వార్నింగ్ గట్టిగానే
గర్జిస్తుంది! / అదే నేడు గ్లోబల్
వార్నింగ్! /ప్లాస్టిక్ ప్రపంచం మా"నవ"
ప్రాణాలతో/ భవిష్యత్ తరాల తలరాతని ప్రశ్నిస్తుంది.
ధరణితల్లి గుండె కాలుష్యపు విధ్వంసంలో
గుండెపోటుతో తల్లడిల్లుతుంది./ జలగళం మూగబోయి రెడ్
సిగ్నల్‌తో/ డేంజల్ సైగలు చేస్తుంది./ మన తాతల కాలం
నాటి చల్లని ప్రశాంత/ గాలులు మనకు జ్ఞాపకాలయ్యాయి.
వడగాలులు, వడదెబ్బ చావులు వాట్సాప్
చాట్ బాక్స్‌లో వర్తమానపు నిజాలయ్యాయి.
వినిపిస్తుందా వసంత కోయిల.


– ఫిజిక్స్ అరుణ్ కుమార్

# 'అనుమాండ్ల భూమయ్య సాహిత్యావలోకనం'



ధూళిపాళ అరుణ ఈ పుస్తకాన్ని అనుమాండ్ల భూమయ్యకు అంకితం చేసారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతిగా, కవిగా, విమర్శకునిగా, గేయకర్తగా, సంపాదకునిగా, పలు గ్రంథాల రచయితగా తెలుగు పాఠకులకు చిరపరిచితులు భూమయ్య. వారి సాహిత్యంపై సమగ్రంగా సందర్శించేందుకు ఈ 'సాహిత్యావలోకనం' ఎంతగానో దోహదపడుతుంది. రచయిత్రి భూమయ్యతో ఇంటర్వ్యూ చేయడం వారి పుస్తకాలపై సమీక్షలు రాయడం, ముఖాముఖి సంభాషణలు చూస్తే ఒక (పిహెచ్‌డి) పరిశోధనా గ్రంథంలా యీ పుస్తకం కనిపిస్తుంది. తాత్వికత-ఆధ్యాత్మికత-కవితాశిల్పం, విమర్శనా విధానం, భక్తి భావనాతత్పరులైన భూమయ్య రచనారీతుల్ని ఈ పుస్తకంలో దర్శింపజేసారు. శివానందలహరి, అప్పాజీస్సుల పద్యావలోకనం, కర్పూర వసంత రాయలు కావ్యాల్ని చక్కగా విశ్లేషించారు. అలాగే పల్లా దుర్గయ్య 'గంగిరెద్దు' కావ్యంలోని కళావైభవ విశ్లేషణ అద్భుతంగా ఉంది. పాల్కురికి సోమనాథుని 'బసవపురాణం- పండితారాధ్య చరిత్రలపై సాధికారిక విమర్శనాత్మక సవిశ్లేషణ (పేజీ.227) పాఠకులకు చేరువౌతుంది. భౌమ మార్గ విమర్శ-సైద్ధాంతిక విమర్శలతో సృజనాత్మక రచన చేసిన భూమయ్య సాహిత్యాన్ని 'అరుణ' బాగానే సమీక్షించారు. అభినందనలు. **(ఆచార్య అనుమాండ్ల భూమయ్య సాహిత్యావలోకనం, రచన: ధూళిపాళ అరుణ, వెల: రూ 200, ప్రతులకు: ధూళిపాళ దత్తాత్రేయశర్మ, హరిహర త్రిశక్తిక్షేత్రం, వలిగొండ, యాదాద్రిజిల్లా)** – తంగిరాల చక్రవర్తి

# సంధ్యాదీప్తిలో అరుదైన దివ్యరోచిస్సు



భౌతిక కోర్కెలు, వాంఛలు సఫలం చేసుకోవడానికి దేవుణ్ని మొక్కుకోవడం, భగవత్కృప కోసం తంటాలు పడటం సామాన్య కుటుంబీకుల జీవితాలలో సహజం. ఐహిక సామాజిక జీవితంలో కొట్టుమిట్టాడే జన సామాన్యానికి దైవభక్తి కేవలం భౌతిక కష్టాల నుంచి దూరం కావడానికే 'సంధ్యాదీపాలు' శీర్షికన ఆధ్యాత్మిక కవితలు, సంపుటిగా వెలువరించిన డా॥సమ్మన్న ఈటెల వ్యవహారిక జీవనంలో కష్ట, నష్టాలు సుఖదుఃఖాలు భరిస్తూ, అలవరచుకొన్న ఆధ్యాత్మికతత్త్వం అరుదైన, అపురూపమైన అన్వేషణా కవితా చింతనతో సాగుతుంది. ఆర్తి, ఆర్ద్రత, వేదన, తపనతో భగవంతున్ని ప్రసన్నం చేసుకోవడం స్వామీజీలకు, యోగులకు, ఆధ్యాత్మికవేత్తలకు మాత్రమేకాదు నిష్కామంగా సేవలందించే సామాన్యులకు కూడా అనుభవైకవేద్యం కావాలని డా॥సమ్మన్న ఈ కవితా రూపేణా అభిలషిస్తున్నారు. లోకహితాన్ని, పరోపకార, మానవతా విలువలతో జీవించేవారు. 'దైవస్పర్శ'లో 'ప్రత్యూషపదనంలా స్పృశించి అనుగ్రహించమని', 'అనంతశక్తిలో ఈ ప్రాణధార విలీనమై పోవడమే తనకు జీవన్ముక్తి' ప్రసాదించమని, ఈ జీవననావకు చుక్కానిగా చోదకశక్తివి నీవేనని, కవి అభ్యర్థిస్తాడు. సంధ్యాదీపాల కాంతి అనిర్వచనీయమైన జీవితానందాన్ని ప్రసాదించే, రవీంద్రుని గీతాంజలిని స్ఫురింపచేసే ఆధ్యాత్మిక కవితామాలికం డా॥సమ్మన్న అభినందనీయులు. **(సంధ్యాదీపాలు, రచన: డా॥సమ్మన్న, వెల: రూ 100, ప్రతులకు: డాక్టర్ సమ్మన్న ఈటెల, 207, సిరి రెసిడెన్సీ, తార్నాక, హైదరాబాద్)**

– యర్రమిల్లి

## పుస్తక సమీక్ష

# సిరికోనలో చిగురించిన కవిత్వం

భారత నౌకాదళంలో అధికారిగా ఉద్యోగిస్తున్న దర్భముళ్ళ చంద్రశేఖర్ యిదివరలో నాలుగు కవితా సంపుటాలు, ఒక దీర్ఘకవిత వెలువరించిన అనుభవజ్ఞుడు. ఇప్పుడు తాజాగా 'చిగురించిన శిలాజం' పేరిట సిరికోన వేదికగా వ్యక్తమయిన దాదాపు 100 కవితలతో మన ముందుకొచ్చారు. సమకాలీన సామాజికాంశాలకు అనుభూతులనద్ది తన అనుభవాలను కవిత్వీకరించిన తీరు



అబ్బురపరుస్తుంది. మృతప్రాయమైన గతాన్ని వదిలి వర్తమానంతో చిగురించిన మానసిక వికాసంతో భవిష్యత్తును సస్యశ్యామలం చేసుకోవాలని పిలుపునిస్తున్నాడు చంద్రశేఖర్. మానవతా కోణాన్ని ఆవిష్కరిస్తు కవితల్ని అల్లాడు. 'నువ్వెదురుగా వున్నప్పుడు/నిన్ను ఒప్పుకోను/ లేనప్పుడు కలిగే నొప్పిని/ లజ్జ పూసుకున్న లేకితనంతో చెప్పుకోనూలేను' ఎందుకంటే 'అవునుమరి..నేను 'మగాణ్ణి' అంటూ నేటి మగాడిలోని 'ఎగో'ని ఎత్తిచూపుతాడు. 'మట్టిదేముంది?.. నలుగురం కలిసి నడుంవంచి.. అక్కడో ఇక్కడో తవ్వి తలకెత్తుకుంటాం! ఆనవాలు తెలియని మత్తులో మనిషిపోతే మళ్లీ విత్తుకోగలమా..మానవుణ్ని మొలకెత్తించుకో అంటు మనిషి అస్తిత్వానికి మానవత్వమే మూలమని తెలియజేస్తున్నాడు కవి. **(చిగురించిన శిలాజం, రచన: దర్భముళ్ళ చంద్రశేఖర్, వెల: రూ 200, ప్రతులకు: 303, ఆర్ఆర్ టవర్స్, రైతు బజారు ఎదురుగుండా, గోపాలపట్నం, విశాఖపట్నం)** – రమణ వెలమకన్ని

# నైతిక విలువల పరిరక్షణకై ప్రయత్నం

ప్రముఖ కవి గుంటూరు శేషేంద్రశర్మ 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో ఆగస్టు-నవంబర్ 1987 మధ్యకాలంలో 'కామోత్సవ్' అనే సీరియల్ నవలను ప్రచురించారు. ఈ ప్రచురణ ఇండియన్ పీనల్‌కోడ్, స్త్రీల అసభ్యచిత్రీకరణల నిరోధచట్టం- 1986 ప్రకారం



నేరం అని ఈదర గోపీచంద్, కార్యదర్శి గాంధీ స్మారక సమితి నరసరావు పేట వారు సదరు పత్రికపై, రచయితపై కేసు వేసారు. 2011 వరకు నడిచిన ఈకేసు కొట్టివేయబడినది. ఫిర్యాది, గాంధీ స్మారక సమితి వారు 1991రివ్యూ పిటిషన్‌కై అప్పీలు దాఖలు చేసినారు. ఆ తరువాత 1994లో సుప్రీంకోర్టులో అపీలు దాఖలు చేసారు. కేసుపూర్వాపరాలు, ఇట్టి అశ్లీల సాహిత్యంపై వెల్లువెత్తిన ప్రజానిరసనలు, సాహితీపోరాటాలు ఈ పుస్తకం 'కామోత్సవ దహనం'లో ఎడిటర్ ఈదరగోపీచంద్ ఆధ్వర్యాన వివరించబడ్డాయి. ఈ కేసు నడుస్తున్నంతసేపూ తెలుగు ప్రజలలో దుమారాన్ని సృష్టించినట్లుగా, ఆ తరువాత కూడా పలువురు ప్రముఖులు ఇలాంటి సాహిత్యాన్ని నిరసించినట్లుగా ఈ పుస్తకంలో వివరించబడ్డాయి. నవంబరు 1987 తర్వాత ఆంధ్ర జ్యోతి వారపత్రిక వారు ఈ సీరియల్ ప్రచురణను ఆపివేసినట్లుగా చెప్పబడింది. **('కామోత్సవ' దహనం, ఎడిటర్: ఈదర గోపీచంద్, వెల: రూ 150, ప్రతులకు: విశాలాంధ్ర, ఇతర బుక్‌హౌస్‌లు)**

– కూర చిదంబరం

షేక్ అబ్దుల్ హకీం జాని

# బీదర్‌లో వారసత్వ సంపద



కర్ణాటకలోని ఈశాన్య మూలన కొండపై నెలకొని ఉన్న చిన్న పట్టణం బీదర్. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదు నుండి 124కి.మీ. కర్ణాటకలోని గుల్బర్గా నుండి 50 కి.మీ. దూరంలో బీదర్ ఉన్నది. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో నెలకొని బీదర్ జిల్లాకు ముఖ్యపట్టణంగా విరాజిల్లుతుంది. దీన్ని బీదరు అని కూడా పిలుస్తారు. ఇది చారిత్రక ప్రాధాన్యత కలిగిన చిన్న పట్టణం. ఇది వాస్తు, అబ్బురపరచే చారిత్రక, మత ప్రాముఖ్యత కలిగిన అనేక ప్రదేశాలకు నెలవు. బీదర్‌లో అనేక చారిత్రక కట్టడాలు ఉన్నాయి. వాటిలో ప్రముఖమైనది బీదర్ కోట. దీన్ని బహమనీ, బరీదషాహిల పాలనలో నిర్మించి అభివృద్ధి చేశారు. మధ్యయుగ దక్షిణ భారతదేశంలోని అత్యంత బలీయమైన కోటలలో ఒకటిగా దీన్ని మార్చారు. మసీదులు, మదర్సాలు, రాజభవనాలు, ఉద్యానవనాలు, సమాధి సముదాయాలతో బీదర్ విరాజిల్లుతుంది. బీదర్ 14వ శతాబ్దంలో బహమనీ రాజ్యానికి రాజధాని. ఈ కోటను అహ్మద్ షా వలీ బహమని నిర్మించాడు. 1432లో అప్పటి బహమనీ సుల్తాన్ అహ్మద్ షా వలీ తన రాజధానిని కలబురగి (గుల్బర్గా) నుండి బీదర్‌కు మార్చినప్పుడు బీదర్ కోటను పునరుద్ధరించడంతో కుగ్రామంగా ఉన్న దీని ప్రాముఖ్యత పెరిగింది. రాష్ట్ర రాజధాని బెంగళూరు నుండి బీదరు సుమారు 700 కి.మీ. దూరంలో ఉంది. ఈ నగరం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా కాలంపాటు నిర్లక్ష్యం వహించింది. అయినప్పటికీ గొప్ప వారసత్వం నిర్మాణాల కారణంగా ఈ నగరం భారత పురావస్తుపటంలో ముఖ్యస్థానం పొందింది. దక్కన్ పీఠభూమిపై ఉన్న అందమైన బీదరు కోట 500 సంవత్సరాలకు పైగా పురాతనమైనది. ఇప్పటికీ చెక్కుచెదరని కట్టడాలను ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తుంది.

బీదరు నగరం బిద్రి హస్తకళ ఉత్పత్తులకు ప్రసిద్ధి. సిక్కులకు కూడా బీదరు పవిత్రమైన తీర్థయాత్రాస్థలం. గురునానక్ ఝీరా సాహిబ్ పేరుతో ఇక్కడ అతి పెద్ద సిక్కు ప్రార్థనా మందిరి ఉంది. 2009-10 సంవత్సరానికి భారతదేశంలోని పరిశుభ్ర మైన నగరాల్లో బీదరు 22వ స్థానంలోను, కర్ణాటకలో 5వ స్థానంలోనూ ఉంది. ఆర్కియాలజీ శాఖ వారు చొరవ తీసుకోవడంతో ఇప్పుడు ఈశాన్య కర్ణాటక ప్రాంతంలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా మారింది. ఇక్కడ బీదర్ కోటతోపాటు అనేకమంది పాలకుల సమాధులు కూడా ఉన్నాయి. దీంతో వాటిని సంరక్షించాలనే ఆశయంతో ఆర్కియాలజీ శాఖ ఆ బాధ్యతను తీసుకుంది. ఇక్కడ మౌర్యులు, శాతవాహనలు, చాళుక్యులు సైతం పరిపాలించారు. ఆ కారణంగా ఈ బీదర్ నగరానికి విశిష్టమైన చరిత్ర ఉంది.

## బీదర్ కోట

దక్షిణ భారతదేశపు కోటల్లో ప్రముఖలైన కోట కర్ణాటకలోని బీదర్‌లో ఉన్నది, బీదర్‌లో ముఖ్యంగా చూడదగిన నిర్మాణం. బహమనీయుల కాలం నాటి ఈ కోటను సుల్తాన్ అల్లాఉద్దీన్ బహమనీ నిర్మించాడు. ఇందులో భారీ రుజువులు, కోటలు, కందకాలు, రంగురంగుల రాజభవనాలు, పాత యుద్ధ వస్తువులు, పాత శిల్పాలు, ప్రాచీన శిలలతో కూడుకున్న మ్యూజియం ఉంది. ఏడు ప్రధాన ద్వారాలు, 37 బురుజులు, లోహ కవచం కలిగిన ఫిరంగులతో పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. ఇందులోకి ప్రవేశం అందరికీ ఉచితం. ఇక్కడ పలు సినిమాల షూటింగులు కూడా జరుగుతున్నాయి. ఇది పీఠభూమి ప్రాంతం. ఇక్కడ ఎటు చూసినా ఉన్నతస్థాయి శిల్పకళ కనిపిస్తుంది. ఒకవైపు కోట, మరోవైపు పూర్వీకుల సమాధులు, గుమ్మటాలు, మీనారులు కనిపిస్తాయి. దేశంలోని అత్యంత బలీయమైన కోటలలో ఇది ఒకటి. బీదర్ తూర్పుభాగాన ఇది ఉంది. కొన్ని రాజభవనాలు, మసీదులు ప్రస్తుతం కొంత శిథిలమైనాయి. కోట ప్రవేశద్వారం ఎత్తైన బురుజుతో గంభీరంగా కనిపిస్తుంది. ఎర్రరాతితో ఇది చాలా ప్రకాశవంతంగా కనిపిస్తుంది. బీదర్ కట్టడాలు నాటి పారసీ, ఇరానీ ఇత్యాది మిళిత శిల్పకళ అప్పటి వైభవ ప్రాభవాలను మన కళ్ల ఎదుట నిలుపుతాయి. కోటకు ఆగ్నేయ మూలలో ఉన్న రెండు ముఖద్వారాల నుండి కోటలోకి ప్రవేశించవచ్చు. మొదటి ద్వారాన్ని షార్జా దర్వాజా అని, రెండవ ద్వారాన్ని గుంబర్ దర్వాజా అని పిలుస్తారు. రెండూ గోపురంతో కూడిన ఈ నిర్మాణంలో కుడ్యచిత్రాలకు తిలకించవచ్చు. బహమనీ రాజవంశానికి చెందిన సుల్తాను అల్లావుద్దీన్ బహమని 1427లో తన రాజధానిని గుల్బర్గా నుండి బీదర్‌కు మార్చారు. ఆమీదట 1427 నుండి 1432 ప్రాంతంలో ఇక్కడ 30కుపైగా నిర్మాణాలు జరిగాయి. తక్త్‌మహల్, షార్జాదర్వాజా, ఇత్యాదివి నిర్మించారు.



అనేక మంది రాజుల చేతులు మారిన ఈ కోట చివరికి నిజాం పాలనలోనూ కొనసాగింది. దీని తరువాత కోటకు సంబంధించిన ఎన్నో నిర్మాణాలు జరిగాయి. 1436 నుండి 1580 మధ్యకాలంలో కొన్ని సమాధులు, మస్జిద్‌లు నిర్మించారు. అప్పటి సుల్తానులు నిర్మించిన నిర్మాణాలు బీదర్‌కు 9.కి.మీ. వరకు వ్యాపించి వున్నాయి. కోటలో ప్రవేశించడానికి విశాలమైన దర్వాజాలు కలవు. వీటికి ఢిల్లీ, మాండూ, కల్యాణీ ఇత్యాది పేర్లున్నాయి. షార్జా దర్వాజా ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఈ దర్వాజా పైభాగంలో ఇరువైపులా రెండు సింహాల బొమ్మలుంటాయి. దర్వాజాల పైభాగం నుండి తిలకిస్తే కోటలోని దృశ్యాలు రమణీయంగా కనిపిస్తాయి. షార్జా, గుంబద్ దర్వాజాల మధ్యస్థలంలో 3వేలమంది సైనికులు కవాతు చేయడానికి వీలున్నది. ఇక్కడి దర్వాజాల్లో అరలు కడురమ్యంగా కనిపిస్తాయి. గుంబద్ దర్వాజా ఎత్తు 16 మీటర్లు, దీని లోపలి వ్యాసం 13 మీటర్లు ఉంటుంది. బీదర్ ముఖ్య మార్గంలో నిర్మించిన ప్రముఖ నిర్మాణం ఫతే దర్వాజా. ఈ దర్వాజా నుండి 1656లో ఔరంగజేబ్ సైన్యం చొరబడి వచ్చింది. బీదర్‌లో బహమనీ, బరీదషాహి సుల్తానుల స్మారకాలు కొన్ని కి.మీ.వరకు వ్యాపించి ఉన్నాయి. వీటిలో కోటనందున్న 16స్థంభాల మస్జిద్, తక్త్‌మహల్, నల్ల బురుజుపైన ఒక ఫిరంగి, రాగిణి మహల్, రాజుల వంటశాల, తర్‌కాశ్ మహల్, గగన్ మహల్, దీవానే ఆమ్, హాజార్ కొఠరీ, నౌబత్ ఖానా వీటితోపాటు 1472లో నిర్మితమైన మహమూద్‌గావ్‌కు చెందిన మదస్సా తక్త్ ఏ-కిర్మానీ, జామామస్జిద్ చెప్పుకోదగినవి. ఉత్తరం వైపు బీదర్ సుల్తానులు, వారి భార్యల సమాధులు, మహనీయులు దర్గాలు కనిపిస్తాయి. ఆనాడు తోటలు కూడా నిర్మించారు.



## బహమనీల సమాధులు

ఇక బీదర్‌లోని అష్టూర్‌లో ఉన్న 12 సమాధుల ప్రాంతాన్ని బహమనీయుల సమాధులు ఎత్తైన గోపురాలు, పెద్ద అలంకరణ తోరణాల వంటి కట్టడాలు ఉంటాయి. ఇక్కడ అహ్మద్ షా-అల్-వలీ సమాధి అత్యంత ప్రాచుర్యమైనది. ఇది బంగారు వర్ణంలో ఖురాన్‌లోని శ్లోకాలతో చెక్కింది. ఇదో తప్పక చూడాల్సిన నిర్మాణంగా నిలిచింది. అలాగే ఇక్కడ సమాధులపై అద్భుతమైన పెయింటింగ్స్ ఉన్నాయి.

## చౌబారా టవర్

బీదర్ నడిబొడ్డున ఉన్న ఈ చౌబారా టవర్ కూడా చూడదగ్గ చారిత్రక కట్టడం. చౌబారా అంటే నలువైపులా చూడదగిన





కట్టడం అని అర్థం. అంటే దీనిపైకి ఎక్కి చూస్తే నగరం మొత్తం కనిపిస్తుంది. దీని ఎత్తు సుమారు 70 అడుగులు ఉండటంతో పైనుంచి వీక్షించడం అద్భుతంగా ఉంటుంది. ప్రస్తుతం ఇది క్లాక్ టవర్‌గా సేవలందిస్తోంది. దీనిపైకి ఎక్కడానికి లోపల మెట్ల మార్గం ఉంది.

## రంగిన్ మహల్

బీదర్ కోటలోనే ఉన్న రంగిన్ మహల్ అద్భుతమైన చూడదగిన ప్రదేశం. నివాస కేంద్రానికి ఎదురుగా రంగిన్ మహల్ ఉంది. దీని అర్థం రంగుల ప్యాలెస్. ఇది రంగుల ఫ్రెస్కో మెరుస్తున్న ఆభరణాలకు ప్రసిద్ధి చెందింది. ఇది కోట అత్యంత అందమైన భాగం. ఒక అరుదైన కట్టడం కాబట్టి ఇప్పటికీ ఇది చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. ఈ రంగిన్ మహల్ 16వ శతాబ్దంలోని హస్తకళలకు సరైన ఉదాహరణ. ఈ మహల్ గుంబద్ గేట్ సమీపంలో ఉండటంతో పర్యాటకులు మర్చిపోకుండా చూడొచ్చు. దీని లోపలి గదులపై అందమైన కళా నైపుణ్యాలతో పాటు నమ్మశక్యం కాని పర్షియన్ టైల్ వర్క్‌తో అలంకరించి ఉంటుంది. చరిత్రలో మహమూద్‌గావ్ ప్రముఖ స్థానం పొందారు. ఈయన కాలంలో నిర్మితమైన మదర్సా ఇరానీ శిల్ప కళలకు అద్దం పడుతుంది. ఇక్కడి మీనారులు కాలగతిన కొంత దెబ్బతిన్నప్పటికీ వాటి శిల్పకళా శోభతగ్గలేదు. 1327లో నిర్మితమైన 16 స్థంభాల మస్జిద్ దక్షిణ భారతదేశంలో అతి ప్రాచీన నిర్మాణం. ఇన్ని ప్రాచీన నిర్మాణాలతో తన ప్రాచీనశోభను బీదర్ కట్టడాలు చారిత్రక సుగంధాన్ని గుబాళిస్తున్నాయి. సోలాహ్ ఖంబె మస్జిద్‌గా పిలిచే 16 స్థంభాల మసీదు, తక్త్ మహల్‌లో చెక్క పనితనం అద్భుతం. రాగిణి మహల్ బీదర్ వాస్తు కళకు ప్రతీకగా కనిపిస్తుంది. తక్త్‌మహల్ బీదర్ ప్రథమ సుల్తాన్ కాలంలో నిర్మించబడింది. దీవానే అమ్, రాగిణి మహల్ నిర్మాణాలు బహమనీ సుల్తానుల కాలం నాటివి. ఈ గోడల్లో చైనా మట్టితో చేసి రంగు ముక్కల పనితనం నగిషీలు అందంగా ఉంటాయి.

## నరసింహస్వామి కేవ్ టెంపుల్

ఇక బీదర్‌లోని చూడదగిన ప్రదేశం నరసింహస్వామి టెంపుల్. ఇక్కడ నరసింహస్వామి ఒక గుహలో సుమారు అరకిలోమీటర దూరంలో ఉండటం విశేషం. ఆ గుహలో వెళ్లాలంటే నీటిలో వెళ్లాల్సి ఉంటుంది. వీటితోపాటు బీదర్‌లో చూడాల్సినవి పాపవినాష్ శివ టెంపుల్, మహమద్ గవాన్ మద్రాసా, హజ్రత్ ఖలీల్ ఉల్లా చౌఖండి దర్శించదగిన ప్రదేశాలు. ●

కథ

# మంగయ్య తెలివి

మంగాపురంలో మంగయ్య అనే రైతు వుండేవాడు. ఒకరోజు రాత్రి అతని రెండు ఎద్దుల్లో ఒక ఎద్దుని ఒక దొంగ తీసుకెళ్ళిపోయాడు. మంగయ్య ఎక్కడ వెతికినా తన ఎద్దు కనిపించలేదు. చేసేదేమి లేక ఇంకో ఎద్దుని కొందామని మంగయ్య సంతకి వెళాడు. అక్కడ తన ఎద్దుని ఒకతను అమ్మకానికి పెట్టడం కనిపించాడు.



'ఇది నా ఎద్దు. ఇది నీ దగ్గరకు ఎలా వచ్చింది?" అని మంగయ్య అతనితో గొడవ పెట్టుకున్నాడు.
ఆ దొంగ హడలిపోయి, బయటకు భయం కనపడనీయకుండా 'ఇది నా ఎద్దే' అని బుకాయించాడు.
వాళ్ల చుట్టూ జనం పోగయ్యారు.
మంగయ్యకి ఒక తెలివైన ఆలోచన వచ్చింది. తన భుజం మీద కండువా తీసి, ఎద్దు కళ్లకి కట్టి 'నా ఎద్దుకి ఒక కన్ను మెల్ల వుంది. ఇది నీ ఎద్దు అంటున్నావు. దీనికి ఏది మెల్ల కన్నో నీకు తెలిసే వుంటుంది కదా. ఏది మెల్లకన్నో చెప్పు?' అని సవాలు విసిరాడు.
అతను దొంగతనం అయితే చేసాడు కాని దాని ముఖాన్ని పరిశీలనగా చూడలేదు. దానికి ఏది మెల్లకన్నో అతనికి అర్థం కాలేదు. ఏదో ఒకటి చెప్పకపోతే పోగయిన జనం చావగొడతారు. అందుకే లేని ధైర్యం తెచ్చుకొని 'కుడికన్ను' అన్నాడు.
'సరిగ్గా ఆలోచించి చెప్పు. కుడి కన్ను కాకపోతే ఈ ఎద్దు నీది కాదు. నాది అవుతుంది' అని మంగయ్య కంగారు పెట్టాడు.
'వామ్మో, ఇదేమిట్రా దేవుడా. నేను మాట మార్చి ఎడమకన్ను అంటే, నీ ఎద్దు సంగతి నీకు తెలియదా? అని జనం నా భరతం పడతారు. దేవుడా కుడి కన్నే అయ్యేట్లు చూడు' అని మనస్సులో దేవుడికి దండం పెట్టుకొని 'నా ఎద్దు సంగతి నాకు తెలియదా? ఖచ్చితంగా కుడి కన్నే మెల్ల కన్ను' అన్నాడు దొంగ.
'మహాజనులారా అంతా విన్నారుగా. ఇప్పుడు చూడండి. నా ఎద్దుకి మెల్లకన్నే లేదు. రెండూ మంచి కళ్లే' అని మంగయ్య ఎద్దు కళ్లకి కట్టిన తన కండువా విప్పాడు.
నిజమే దానికి రెండూ మంచి కళ్లే వున్నాయి. చేసేదేమి లేక దొంగ అక్కడ్నుంచి పారిపోబోయాడు. జనం ఆ దొంగని చెట్టుకి కట్టేసి, పోలీసులకి కబురుపంపి, వచ్చిన పోలీసులకి ఆ దొంగని అప్పగించారు. పోలీసులు మంగయ్య తెలివిని ఎంతో మెచ్చుకొని, మంగయ్య ఎద్దుని మంగయ్యకి అప్పగించారు. మంగయ్య తన ఎద్ద తనకు దొరికినందుకు, ఎంతో సంతోషించి, తన ఎద్దుతో తన ఇంటికి దారి పట్టాడు.

– మా.శ్రీ.రాజు



రంగులు వేయండి



వార్త ఆదివారం

## బాలగేయం

### పిల్లి-కోతి

అనగనగా పిల్లి ఉండె
దానికొక్క తల్లి ఉండె
చెట్టు మీది కోతి తోడ
వాటికేమొ స్నేహముండె
ఒక్కనాడు పిల్లి తల్లి
మేత కొరకు పోయినప్పుడు
కుక్క ఒకటి పొంచి ఉండి
పిల్లిపిల్ల నోట కరచె!
నక్కి నక్కిపోయెనపుడు
ఆరగింప జాచెనపుడు
అదిజూసిన కోతి గెంతి
కుక్కనపుడు రక్కిపెట్టె!
రక్కిన ఆ కోతి నుండి
తప్పించుటపోవుటకై
ఆలోచన చేసి కుక్క
అటునిటుగా ఉరికిందీ!
అది జూసిన ఆ కుక్కకు
హెచ్చుపోయే కోపమపుడు
పిల్లిని కిందకు వదిలీ
భౌ! భౌ! మని
అరవసాగెను
బతుకు జీవుడాయంటూ
పిల్లిపిల్ల పరుగుపెట్టె
అది జూసిన కోతి అపుడు
పిల్లి పిల్లనందుకొనియె
చంకన వేసుకుని పిల్లిని
దాని తల్లికందించెను

**డా॥గౌరవరాజు సతీష్ కుమార్**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

### గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.అభిజ్ఞాశ్రీ,** గూడూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మొక్కల ఆకులు ఆకుపచ్చగా ఉన్నప్పటికీ, వాటికి పుట్టిన పుష్పాలు మాత్రం రంగులలో వుంటాయి. ఎందువల్ల?**

**జవాబు: అభిజ్ఞాశ్రీ!** పత్రహరితం(క్లోరోఫిన్) వుండటం వలన ఆకులు ఆకుపచ్చగా ఉంటాయి. ఆకుకు ఆహార పదార్థాలను కిరణజన్య సంయోగ క్రియ ద్వారా తయారు చేయడానికి ఆకులోని ఆకుపచ్చ రంగు ఏమాత్రం ఉపయోగించుకోదు. సూర్య కాంతిని గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను, మొక్క వేళ్ల ద్వారా ఆకుల్లోకి చేరిన నీటి ఆవిరిని మేళవించడం ద్వారానే కిరణజన్యసంయోగక్రియ జరుగుతుంది. ఈ ప్రక్రియ ద్వారా మొక్కకు అవసరమైన ఆహారం రూపొందుతుంది. మొక్కకు కలిగిన పువ్వులు మాత్రం ఈ ప్రక్రియలో పాల్గొనవు. మొగ్గగా ఉన్నప్పుడే పువ్వు రేకలలో రకరకాల రంగులు(పిగ్మెంట్స్ రూపంలో) ఉండటంతో ఆయా మొక్కలను అనుసరించి వివిధ రూపాల్లో, రంగులలో మొగ్గలు పువ్వుల రూపాన్ని సంతరించుకుంటాయి.

**- జి.కార్తికేయన్,** నెల్లూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. రేడియం వలన లాభనష్టాలు ఏమిటి?**

**జవాబు: కార్తికేయన్!** సూర్యకాంతి తరహాలోనే మన దేహం రేడియంను స్వీకరిస్తుంది. నొప్పి నివారణలకు, అల్సర్లకు, మధుమేహ వ్యాధికి రేడియం మంచి ఔషధం అనే ప్రచారం గతంలో ఉండేది. అప్పుడు ఈ మూలకపు విష ప్రభావం గురించి సాధికారికంగా తెలియదు. ఎక్కువ మోతాదులో, ఏ రూపంలో రేడియంను తీసుకున్నా శరీరం శిథిలమవుతుంది. శరీరంలో ఒక మైక్రోగ్రామ్ రేడియం చేరితే కేన్సర్ వస్తుందని పరిశోధనలు తేల్చాయి. 0.1 మైక్రోగ్రామ్‌ల రేడియమ్ వలన శరీరానికి ఎలాంటి ఇబ్బంది లేదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అణుకేంద్రాలు, సంస్థల ఉద్యోగులు జీవిత కాలంలో 0.3 మైక్రో క్యూరీల ప్రమాణం వరకు రేడియేషన్ భరించగలరని తేలింది. రేడియో ధార్మిక శక్తిని క్యూరీ యూనిట్‌లలో కొలుస్తారు.







# ఔషధాల్లో మేటి యాలకులు

– తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

**సాధారణంగా మన వంటింట్లో యాలకులు తప్పకుండా ఉంటాయి. కొన్ని రకాల వంటకాల్లో, మసాలాల్లో, టీలో యాలకులను ఉపయోగిస్తుంటారు. రెండు రకాల యాలకులు మనకు అందుబాటులో ఉంటాయి. చిన్న యాలకులు లేదా పెద్ద యాలకులు. తినుబండారాలలో సువాసన కోసం పెద్ద యాలకులను ఉపయోగిస్తారు.**

చిన్న యాలకులను తీపి పదార్థాలలో కలుపుతుంటారు. శరీరానికి అవసరమయ్యే నూనెలు యాలకుల్లో సమృద్ధిగా ఉంటాయి. మనం సాధారణంగా ఆకుపచ్చరంగులోని యాలకులను చూసి ఉంటాం. స్వీట్స్ తయారీలో యాలకులు ఉపయోగిస్తారు. అలానే కేసరి, లడ్డూ, హల్వా వంటి వంటకాల్లో వాడుతుంటారు. అంతేకాదు వీటి సువాసన కూడా అమోఘం. వీటితో బిర్యానీ, వంటకాలు తయారు చేస్తే ఘుమఘుమలాడతాయి. నోట్లో ఒక యాలకుల పలుకు వేసుకుని నోటి దుర్వాసనను అరికట్టవచ్చు. శ్వాసలో తాజాదనాన్ని నింపవచ్చు. నిజానికి ఈ చిన్న పనులతో పాటు ఆరోగ్యపరంగా ఎంతో పెద్ద ప్రయోజనాలు ఇస్తాయి. 4000 సంవత్సరాలకు క్రితం నుంచే యాలకులకు మనదేశమే కేరాఫ్ అడ్రస్. అయితే మొదటి వీటిని పురాతన ఈజిప్ట్‌లో కూడా సంప్రదాయకంగా ఉపయోగించేవారు. రోమన్లు, గ్రీకులు వీటిని ఎక్కువగా తర్వాత స్కాండినేవియన్ దేశాల్లో వినియోగించేవారు. ఇప్పుడు ప్రపంచమంతా వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. అరోమాథెరపీలో దీనికో ప్రత్యేకస్థానం ఉంది. ఏదైనా దెబ్బ తగిలినప్పుడు ఈనూనె రాస్తే సెప్టిక్ రాకుండా కాపాడే గుణాలు ఉన్నాయని చెప్తున్నారు పరిశోధకులు. ఈ నూనె వాసన పీలిస్తే చాలు అలసట తగ్గటమే కాకుండా మంచి రిలీఫ్ వస్తుందిట. రక్తహీనతను నివారించే అద్భుతమైన యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు యాలకుల్లో ఉన్నాయి. రక్తహీనత వల్ల వచ్చే అలసట, నిస్సత్తువ వంటి లక్షణాలను యాలకుల్లోని కాపర్, ఐరన్, మాంగనీస్, రైబో ఫ్లేవిన్, విటమిన్ సి, నియాసిన్ వంటివి తగ్గిస్తాయి. ఇవి ఎర్రరక్తకణాల సంఖ్యను కూడా పెంచుతాయి. మెటబాలిజం ప్రక్రియను మెరుగు పరుస్తాయి. ఒక గ్లాస్ వేడి పాలలో కొంత పసుపును, యాలకుల పొడిని కలిపి రోజూ రాత్రిపూట తీసుకుంటే నీరసం తగ్గుతుంది. రక్తహీనత వల్ల వచ్చే ఇతర అనారోగ్యాలు కూడా దూరమవుతాయి. బరువును తగ్గించుకోవడానికి ఒక్కొక్కరు ఒక్కో రకమైన ప్రయత్నం చేస్తున్నారు. అటువంటివారు యాలకులు తిని ఒక గ్లాసు వేడి నీళ్లు తీసుకుంటే శరీరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీంతో అధిక బరువును, శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు యాలకులు చాలా ఉపయోగపడతాయి. యాలకులను ఇంట్లో మసాలా దినుసులుగాను, మౌత్ ఫ్రెష్‌నర్‌గా వాడుతుంటారు. రెండు యాలకులు తిని ఒక గ్లాసు వేడి నీళ్లు తీసుకుంటే శరీరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీంతో అధిక బరువును, శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు యాలకులు చాలా ఉపయోగపడతాయి. అంతేకాదు రెండు యాలకులు తిని ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగడడం ద్వారా అద్భుతమైన ఫలితాలు ఉన్నాయంటున్నారు ఆయుర్వేద నిపుణులు.



యాలకులు కఫం, దగ్గు, ఆస్తమా వంటి వ్యాధులతోపాటు కడుపులో మంటను నివారిస్తుందట. హృదయ ఆరోగ్యానికి సహకరించడంతో పాటు మానసిక ఒత్తిడిని నియంత్రిస్తాయి. మూత్రపిండా ల్లో రాళ్లను కరిగిస్తారు. ఉదర సంబంధిత వ్యాధుల నివారణకు యాలకులను ఉత్తమం.

పొట్ట పెరిగిపోయి ఇబ్బందిగా తయారైనప్పుడు యాలకుల వైద్యం దానికి చక్కని పరిష్కారమార్గం. యాలకుల్లో పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవన్నీ ఊపిరితిత్తుల్లో రక్తప్రసరణ సాఫీగా జరిగేలా చేస్తాయి. ఆస్తమా వ్యాధితో బాధపడేవారు యాలకుల పొడిని పాలలో కలిపి తీసుకుంటే ఫలితం ఉంటుంది. ఈరోజుల్లో టెన్షన్లు, బిజీలైఫ్ స్టైల్, రెడీ టూ ఈట్ ఆహారపు అలవాట్ల వల్ల ప్రజల్లో సహజసిద్ధంగా ఉండే శృంగార సామర్థ్యం తగ్గిపోతుంది. సెక్స్ పరమైన సమస్యలు ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు పుట్టకపోవడమన్నది ఎక్కువమందిలో కనిపిస్తోంది. ఇందుకు కారణాలేమైనా సమస్యల్ని పరిష్కరించుకోవడానికి యాలకుల వంటి సుగంధ ద్రవ్యాలు కొంతవరకూ ఉపయోగపడుతున్నాయి. యాలకులు మూడ్‌ని పెంచుతాయి. వాటి సువాసన ఒత్తిడిని దూరం చేస్తుంది. శృంగార జీవితంలో సమస్యలు ఉన్నవారు యాలకులు ఎక్కువగా తీసుకోవాలని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. వీర్యకణాలు వృద్ధి చెందుతాయి. నపుంసకత్వం లాంటి లైంగిక సమస్యలు దూరమవుతాయి. అంతేకాకుండా శరీరంలోని చెడు పదార్థాలు కూడా తొలగిపోయి రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. వీటిలో సినేయిల్ ఉంటుంది. ఇది లిబిడోను పెంపొందించడానికి ఉపయోగపడుతుంది.



రోజూ భోజనం చేసిన తర్వాత యాలకులు తింటే ఎసిడిటీ బారి నుంచి కాపాడటానికి ఉపయోగపడతాయి. కమ్మని సువాసన, రుచిని అందించే యాలకుల గింజలను తరచుగా నోట్లో వేసుకోవడం వల్ల మద్యపానం, దూమపానానికి దూరంగా ఉండవచ్చు. రోజూ తినడం అలవాటు చేసుకుంటే చెడు అలవాట్లను పక్కన పెట్టవచ్చు.

ఈరోజుల్లో ఎక్కువమందికి ఎదుర్కొంటున్న మరో సమస్య మలబద్ధకం. యాలకులను టీలలోగానీ, ఏ రూపంలో తీసుకున్నా జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. రెండు, మూడు యాలకులు, లవంగాలు, చిన్న అల్లం ముక్క, ధనియాలను తీసుకుని పొడి చేయాలి. దీన్ని ఒక గ్లాసు వేడి నీటిలో కలుపుకుని తాగితే అజీర్ణ సమస్య పోతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ తగ్గుతాయి. వికారం, వాంతి వస్తున్నట్టు అనిపించినప్పుడు రెండు యాలకుల్ని నోట్లో వేసుకుంటే చాలు. సమస్యలు అదుపులో ఉంటాయి. ఆస్తమాను కాస్త అదుపులో ఉంచగలిగే గుణాలు యాలకుల్లో ఉంటాయి..

ఆకుపచ్చని యాలకులు గురక తగ్గించేందుకు, దగ్గు నివారణకు, శ్వాస ఆడకపోవడాన్ని తగ్గించేందుకు బాగా పని చేస్తాయి. జలుబు, దగ్గు, తుమ్ములు ఎక్కువగా ఉన్నప్పుడు యాలకులు, అల్లం ముక్క, లవంగం, ఐదు తులసి ఆకులు కలిపి తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది.

గొంతులో వాపు వచ్చినప్పుడు ముల్లంగి నానబెట్టిన నీటితో యాలకులను రుబ్బి తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. దగ్గు, గొంతులో మంటతో పాటు బొంగురుపోయినట్లుగా ఉంటే ఉదయం లేవగానే యాలకులను నమిలి తినాలి. ధారాళంగా పీల్చుకునేందుకు యాలకులు



సహాయపడతాయి. ఊపిరితిత్తుల్లోని ఇన్‌ఫెక్షన్‌లను నయం చేస్తాయి. ఒత్తిడిని, అలసటను దూరం చేయడంలో యాలకులు చక్కగా పనిచేస్తాయి. డయాబెటిస్‌ని అదుపులో ఉంచుతాయి. అధిక రక్తపోటును నియంత్రిస్తాయి. రక్తంలోని గడ్డలను నివారించే రక్తప్రసరణను సాఫీగా జరిగేలా చేస్తాయి. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా చూస్తాయి. పక్షవాతం, ఛాతీమంట, చర్మవ్యాధులు వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. రక్తహీనత సమస్య ఉన్నవారు రోజూ యాలకులను తినాలి. దీంతో రక్తం పెరుగుతుంది. శరీరం అంతర్గతంగా శుభ్రమవుతుంది. తలనొప్పితో బాధపడేవారు యాలకుల పొడిలో కొద్దిగా ఆలివ్ నూనె కలుపుకుని నుదిటిపై రాసుకుంటే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలకులు కంటి చూపును మెరుగుపరుస్తాయి. కేన్సర్ వ్యాధికి చెక్‌పెట్టాలంటే రోజువారి ఆహారంలో యాలకులు చేర్చుకుంటే ఫలితం ఉంటుంది. అంతేకా కుండా శరీరంలో వ్యర్థపదార్థాలను బయటకు పంపుతుంది. యాలకులను నీటిలో మరిగించి అందులో కొద్దిగా చక్కెర, కీరదోస రసం వేసి కాసేపు మరిగించాలి. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే శరీర ఒత్తిడి, అలసట తగ్గుతుంది. ●

కార్టూని
స్టుల
నుండి ఆరోగ్య
కరమైన హాస్యాన్ని
అందించే కార్టూ

## కార్టూన్లకు ఆహ్వానం

న్లను స్వాగతిస్తున్నాం. అంశం
ఏదైనా సరే! మంచి హాస్యాన్ని
అందించాలి. కార్టూన్లతో పాటు మీ
పేరు, చిరునామా, హామీపత్రం
తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని
కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత
చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన
చిరునామా: లోయర్ ట్యాంక్ బండ్,
డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

కథ

# తోడు పెండ్లి కొడుకు

**ఆర్.సి.కృష్ణస్వామి రాజు**

**ఇంటి ముందర కానుగ చెట్టుకింద దిగబడిన నార మంచం మీద కూర్చుని ఉన్నాడు కొప్పుల రాజు. తెలుగు న్యూస్ పేపర్‌ని పైనుంచి కింది వరకు పడీ పడీ చదువుతున్నాడు.**

**"ఫ్లాష్ న్యూస్ ఏమైనా ఉందా మామా?" అని అడిగినాడు దారిన డ్యూటీకి పోతున్న పోస్ట్ మ్యాన్ పురంధరుడు.**

**"ఆడ, మగ పెళ్లి చేసుకునే రోజులు పోతున్నాయి, మగకి మగ, ఆడకి ఆడ కలిసి పెండ్లి చేసుకునే రోజులు వచ్చినాయి. అదే ఈరోజు పేపర్‌లో ఫ్లాష్ న్యూస్" అన్నాడు.**

పడీ పడీ నవ్వుతూ వెళ్లినాడు పోస్ట్ మ్యాన్.

ఇంతలో..

బుల్లెట్ బండి ఊర్లోకి వస్తున్నట్లు డగ్గ డగ్గ శబ్దం మొదలయ్యింది.

పేపర్‌ని మంచంపైనే పారేసి ఇంట్లోకి పరుగులు తీసినాడు కొప్పులరాజు.

"ఏమయ్యిందబ్బా ఈ మనిషికి?" అని ఆశ్చర్యపోయింది కొప్పులరాజు భార్య కుసుమకుమారి.

నేరుగా పడక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు.


కుసుమకుమారికి విషయమేమీ అర్థం కాలేదు.

గబగబా ఇంటి బయటికి వచ్చి చూసింది.

బుల్లెట్ బండి మీద దుర్రుమని వెళ్తున్నాడు ఇన్సూరెన్సు ఏజెంటు బాల గుర్రప్ప. వెనుక సీట్లో పనీపాటా లేని బాలగుర్రప్ప మరిది, మనోహరుడు ఉన్నాడు. వాడు బండికి ఆ పక్క ఒక కాలు, ఈ పక్క ఒక కాలు వేసుకుని రాజాలాగా వెళ్తున్నాడు.

"ఇది మనం అమ్మిన బండే కదా. పదేళ్ల ముందు పెద్దకూతురు సమర్త ఆడినప్పుడు తీసింది. తిరుపతి బై పాస్ రోడ్డులో సెకండ్ హ్యాండ్ బండ్ల అమ్మే చోట కొన్నది. అప్పటికే బండి వయసు పదేళ్లు. మనం పదేళ్లు వాడాం. ఎక్కువ రిపేర్లు వస్తున్నాయని అమ్మేద్దామని చూస్తూ ఉంటే బాలగుర్రప్ప మంచి ధరకే కొన్నాడు.

అట్లాంటి బండి శబ్దం వింటే ఈయన ఎందుకు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడో.." అని ఆలోచిస్తూ ఇంట్లోకి నడిచింది.



కొప్పులరాజు మెల్లగా తలుపు తీసుకుని వీధిలోకి వచ్చి చూశాడు.

బుల్లెట్ బండి, వీధి దాటి వెళ్లిపోయి ఉండటంతో 'హమ్మయ్య' అని నేల మీద కూర్చున్నాడు.

కొప్పులరాజు నోరు ఎండిపోయి ఉంది. చేతులు, కాళ్లు చిన్నగా వణుకుతున్నాయి.

కుసుమకుమారి కారణం అడుగుదామని అనుకుంది. కానీ ఆరు పదుల వయసు దాటిన మొగుడు గాబరా పడి గుటుక్కుమంటాడేమోనని ఆ సాహసం చేయలేదు.

మెడలోని పసుపుతాడును కళ్లకి అద్దుకుంటూ నల్లకుండలోని చల్లనీళ్లు తెచ్చి ఇచ్చింది.

నీళ్ల గ్లాసు ఖాళీ చేసి "కడుపు మంటగా ఉంది, మజ్జిగనీళ్లివ్వు" అని అడిగినాడు.

పలచటి మజ్జిగలో అల్లం, కొత్తిమీర వేసి ఇచ్చింది. తృప్తిగా తాగి బ్రేవ్‌మని తేన్చి అలాగే నేల మీద పడుకుని నిద్రపోయాడు.

...........

మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యింది.

ఊర్లోంచి ఇన్సూరెన్స్ ఆఫీసుకు బుల్లెట్ బండి మీద బయలుదేరాడు ఏజెంటు బాలగుర్రప్ప.

బండి స్టార్ట్ అయిన తక్షణం గుర్రం మీదకు ఎగిరి కూర్చున్నాడు మనోహరుడు.

బండి పోతూ వుంటే ఇండ్లలోని ఆడోళ్లు చాలామంది ఏదో పని వున్న మాదిరి ఇంటి బయటికి వచ్చి బుల్లెట్ బావలను చూసినారు.

ఉండబట్టలేని చెక్కపండ్ల చూడామణి, జున్ను ముక్కలాంటి జమునలు టాటా చెప్పినారు.

బాలగుర్రప్ప, మనోహరుడికి ఫ్రీగా ఫుల్ ట్యాంక్ పెట్రోల్ పట్టించినంత ఖుషీ అయ్యింది.

"నన్ను చూడకుండా పోతావుండారే!" అని తెల్ల పంచెను చాకిరేవు బండ మీద గట్టిగట్టిగా బాదింది ముత్యాలమ్మ.

బండి చిన్నగా కొప్పులరాజు ఇంటి మీదుగా వెళ్లసాగింది.

చెవుల్లో చిన్న చిన్న చీమలు దూరినట్లయ్యింది కొప్పులరాజుకి. ఉలిక్కిపడి లేచినాడు.

ఈసారి.. చెవుల్లో దూది పెట్టుకుని పడక గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు.

మొగుణ్ణి చూసి ముక్కు మీద వేలేసుకుంది కుసుమకుమారి.

బండి మీద స్టయిలు స్టయిలుగా వెళ్తున్న వారిద్దరినీ చూసింది.

బాలగుర్రప్పకు బండి కొనక ముందు సైకిల్ ఉండేది. దాన్ని తాజ్‌మహల్ మాదిరి భద్రంగా చూసుకునేవాడు. మరిది మనోహరుడిని దాని దగ్గరికి కూడా రానిచ్చేవాడు కాదు.

అట్టాంటిది వాడిని బుల్లెట్ బండి మీద ఎందుకు ఊరేగిస్తున్నాడబ్బా? అని అనుమానమేసింది కుసుమకుమారికి.

"ఏదో ఒక సమయంలో విషయం బయటికి రాదా?" అని ఆలోచించడం మానేసింది.

బుల్లెట్ బండి వెళ్లిపోయిన విషయం నిర్ధారణ చేసుకుని మొగుడి దగ్గరికి వెళ్లి "ఏమిటండీ మీ బాధ? మనం ఇష్టపడే కదా బండిని అమ్మింది.. గుర్రప్పకు బండిని మనం ఉచితంగా ఇవ్వలేదు కదా. రేటు కూడా బాగానే పలికింది కదా!" అని అడిగింది.

"మనది దరిద్ర జాతకమే కుసుమా! బండి మన దగ్గర వున్నప్పుడు ఎప్పుడూ రిపేర్లే. ముప్ఫై యేండ్లు రైల్వే ఉద్యోగం చేసిన నాకు నెల నెలా వచ్చే పెన్షన్‌లో సగానికి సగం దాని రిపేర్లకు పెట్టేవాడిని. గుండు మీద గుండు గీచినట్లయ్యేది. ఎంత ఖర్చు పెట్టినా కదలనంటే కదలనని మొండికేసేది. అట్టాంటి బండి బాలగుర్రప్ప చేతిలోకి పోయినాక పూర్తిగా మారిపోయింది. అదిప్పుడు ఆలీబాబా నలభై దొంగలు సినిమాలో ఎన్టీఆర్ గుర్రంలాగా దూసుకుపోతోంది. నా చేతిలో ఉన్నప్పుడు బాగుండక, వేరేవాళ్ల చేతిలోకి పోయాక బాగుంటే నాకు కడుపు మండదా?" అని ఎగిరి దుమికినాడు.

...........

సాయంత్రం అయిదయ్యింది.

శుభ్రంగా ముఖం కడుక్కుని టీవీ చూస్తూ వేడి వేడి పకోడీలు తింటున్నారు కొప్పులరాజు దంపతులు.

డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు పోస్ట్‌మ్యాన్ పురంధరుడు.

"పురంధరా.. నటరాజ సర్వీస్ (నడక) చేస్తూ ఎన్ని రోజులు డ్యూటీ చేస్తావు? వందల ఉత్తరాలు ఎలా బట్వాడా చేస్తావు? పాత బండి ఒకటి కొనుక్కోకూడదా?" అని అడిగింది కుసుమకుమారి.

"అక్కా! రోట్లో తల పెట్టినోడికి రోకలి దెబ్బలి తప్పవని మా మేనమామ నాకు చిన్నప్పుడే చెప్పినాడు. పాత బండి కొనడమంటే రోకట్లో తల దూర్చినట్లే. అంతేకాదు, ఆయన ఇంకో విషయం కూడా చెప్పినాడు. అదేమిటంటే- నీకు ఎవరి మీదైనా పగ, కక్ష, ద్వేషం, అసూయ ఉంటే- పాత బండి ఒకటి వాళ్ల చేత కొనిపిస్తే చాలు. పీక్కోలేక, పారేయలేక, రిపేర్లు చేయించలేక పోరాడి.. పోరాడి

"మళ్లీ ఎందుకొచ్చాడు ఈ గుర్రప్ప?" అని వారి ముఖాలు ప్రశ్నమార్కు గుర్తులయినాయి.
"మామా, మామా..." అంటూ బాలగుర్రప్ప జిగేల్ జిగేల్ కీ చైన్ తిప్పుతూ ఇంట్లోకి వస్తున్నాడు.
ఆవు పోతూ ఉంటే దాని వెనుకనే దూడ వచ్చినట్లు మనోహరుడు కూడా వచ్చినాడు.

ప్రాణాలు విడిచేస్తారని. అందుకని ఆ సాహసం చేయలేదు. వసతి ఉన్నరోజు షో రూమ్ బండే కొంటానక్కా!" అని చెప్పి టెలిగ్రామ్ లెక్కన సర్రున వెళ్లినాడు.

"ఆ.." అని నోరు తెరిచింది కుసుమకుమారి.

ఊరి మొదట్లో నుంచి 'డగ్గు డగ్గు' బుల్లెట్ శబ్దం చిన్నగా వినిపించడం ప్రారంభించింది.

కొప్పులరాజు ప్రాణం వలలో ఇరుక్కున్న చేపలా గిలగిల్లాడసాగింది.

తట్టుకోలేకపోయాడు... అక్కడ క్షణం కూర్చోలేకపోయాడు. ఒళ్లంతా చెమట పట్టసాగింది.

"టెన్షన్ ఎక్కువైనప్పుడు పిడికిలితో గోడని గట్టిగా కొట్ట"మని డాక్టరిచ్చిన సలహా గుర్తుకొచ్చింది. నేరుగా పెరట్లోకి వెళ్లాడు. ప్రహరీ గోడను దభీ దభీమని కొట్టసాగాడు.

'మరిన్నిసార్లు కొడితే ప్రహరీ గోడకూలిపోతుంది. మళ్లీ గోడ కట్టడానికి ఊళ్లో మెస్త్రీలు కూడా దొరకరు" అని పరుగెత్తుకెళ్లి మొగుణ్ణి పట్టుకుంది కుసుమకుమారి.

బుల్లెట్‌బండి ఇంటి ముందర ఆగిన శబ్దం.

"మళ్లీ ఎందుకొచ్చాడు ఈ గుర్రప్ప............!?" అని వారి ముఖాలు ప్రశ్న మార్కు గుర్తులయినాయి.

"మామా, మామా..." అంటూ బాలగుర్రప్ప జిగేల్ జిగేల్ కీ చైన్ తిప్పుతూ ఇంట్లోకి వస్తున్నాడు.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

*sunmagvaartha@gmail.com*

ఆవు పోతూ ఉంటే వెనుకనే దూడ వచ్చినట్లు మనోహరుడు కూడా వచ్చినాడు.



గుర్రప్పను చూసిన కొప్పులరాజు గుండెలోని ధమనులూ, సిరలూ గిలగిల్లాడినాయి.

ఇంట్లో ఎవ్వరూ కనిపించకపోయేసరికి గుర్రప్ప నేరుగా పెరట్లోకి వచ్చాడు.

ఏడుపు ముఖంతో ఉంటే బాగుండదని కొప్పులరాజు గబగబా ముఖం మీద నీళ్ల పోసి కదుక్కున్నాడు.

దగ్గరగా గుర్రప్పను చూసిన కొప్పులరాజుకు చొక్కా జేబుల్లో ఎర్ర చీమలు చేరి టుక్కు టుక్కుమని కుట్టినట్లయ్యింది. కంట్రోల్ చేసుకోవడానికని మనసులోనే ఒకటి, రెండు... వంద దాకా లెక్కించినాడు.

"మామా... మీరు ఇక్కడ ఉండారా? ఇల్లంతా వెదికినాను" అంటూ దగ్గరికి వచ్చినాడు.

కుసుమకుమారి పలకరింపుగా నవ్వి "రా గుర్రప్పా!" అని పిలిచింది.

"నువ్వు చెప్పకుండానే వచ్చేసినానులే అక్కా.. ఇంట్లోకి" అని ముసి ముసి నవ్వులు నవ్వినాడు.

"మామా.. నేను బండి కొన్నరోజు అన్ని కాగితాలూ ఇచ్చేసినావు కానీ ఇన్సూరెన్స్ కాగితాలు ఇవ్వడం మరిచినావు" అన్నాడు.

మిరియాల కషాయం తాగినట్లున్న ముఖంతో కొప్పులరాజు "ఇస్తా.. ఇస్తా" అంటూ నేరుగా దేవుడి గదిలోకి వెళ్లినాడు. అటక పైన ఉన్న పాత ఫైళ్లను వెదకసాగాడు.

టక్కుమని బుల్లెట్ బండికి పెట్టిన రిపేర్ల ఖర్చు ఫైల్ పైనుంచి కింద పడింది. పాత సినిమాల్లో మనసులోనే కుమిలిపోయే గుమ్మడిలాగా అయినాడు. ఎవ్వరూ గమనించకుండా లోపల్లోపలే కుమిలినాడు.

కొద్దిసేపటికి తేరుకుని ఇన్సూరెన్స్ కాగితాలు బయటికి తీసి గుర్రప్ప చేతికి ఇచ్చినాడు.

"మామా, నీ మాదిరి రికార్డులు భద్రంగా పెట్టుకునేవాళ్లు మన మండలంలోనే ఎవ్వరూ ఉండరు" అంటూ గుర్రప్ప బండి దగ్గరికి వెళ్లాడు.

గుర్రప్ప పొగడ్తలకి కొప్పులరాజులో ఏమాత్రం చలనం లేదు. తలలో రగిలే సెగలు గక్కే వేడి ఇంకా ఎక్కువయ్యింది. అర్జంటు పని ఉన్నోడిలాగా ఇంట్లోకి వెళ్లి కిటికీ గుండా బండినే తొంగి తొంగి చూడసాగాడు.

బుల్లెట్ బండి కేరళ ఏనుగులాగా మిలమిలా మెరుస్తోంది. దానికి కొత్త సీటు వేయించి, రంగు రంగుల స్టిక్కర్లు అతికించబడి ఉన్నాయి.

"నీళ్లేసి, సోప్ వేసి తడి పొడి గుడ్డలతో బాగా తుడుస్తున్నట్లు ఉన్నాడు. అందుకే ఆ మెరుపు అని కుళ్లినాడు కొప్పులరాజు. కడుపులో మంట మొదలయ్యేసరికి జేబులోని జెలసిల్ మాత్రలు చప్పరించడం ప్రారంభించాడు.

ఇంతలో-

"బండి బాగుండాదా గుర్రప్పా?" అని అడిగింది కుసుమకుమారి.

"అయ్యో! ఏమి చెప్పేదక్కా? కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందంటారు. ఏనుగును సాకినట్లుగా ఉందక్కా ఈ బండి వ్యవహారం. పెద్ద బండి వేసుకుని పల్లెల్లో తిరిగితే జనాల్లో గుర్తింపు ఉంటుందని వదల్లేకపోతున్నాను. మన ఊరి రోడ్లేమన్నా నెక్లెస్ రోడ్డా? రోజూ కిందా మీదా పడుతున్నాం ఈ గుంత రోడ్లల్లో.

పోతా ఉన్నప్పుడే అది బండి. ఆగిందంటే జగమొండి. అందులోనూ నాకు బండి కొత్త. ఎగిరి దంచినా ఎగిరెగిరి దంచినా ఒకే పిండి మాదిరి ఒక పట్టాన స్టార్ట్ కాదు. కిక్కు కొట్టీ కొట్టీ మోకాళ్లు విరిగిపోయేట్లు ఉండాయి. ఎప్పుడు ఎక్కడ ఆగిపోతుందో తెలియదు. ఆగిపోయిన బండికి కిక్కు కొట్టలేక అల్లాడతా ఉండాను. అందుకనే కదా ఈ తోడు పెండ్లికొడుకు!" అని మనోహరుడిని చూపినాడు.

గుర్రప్ప మాటలకు ముసిముసి నవ్వులు నవ్వినాడు మనోహరుడు. థర్డ్ హ్యాండ్ బండి అయినా ఎట్ల కిక్కు కొడితే బండి స్టార్ట్ అవుతుందో తెలుసుకున్నాను. జీవితాంతం మా మామ ఈ బండినే వాడాల. నన్ను తోడు చేసుకునే తిరగాల దేవుడా!" అని దేవుణ్ణి కోరినాడు మనోహరుడు.

ఆశ్చర్యంగా చూస్తున్న కుసుమకుమారితో మళ్లీ గుర్రప్ప "ఎక్కడంటే అక్కడ ఆగిపోతుందక్కా ఈ బండి. కిక్కు కొట్టేదానికి మనిషి ఉండాలని ఈ తోడు పెండ్లికొడుకుని కూడా ఊర్లన్నీ ఊరేగిస్తున్నాను" అని చెప్పినాడు.

మనోహరుడు ఎగిరెగిరి కిక్కు కొట్టినాడు.

బండి స్టార్ట్ అయ్యింది.

జూనియర్ ఎన్టీఆర్, రాంచరణ్‌ల లాగా బుల్లెట్ బండిలో దుమ్ము లేపుకుంటూ జుయ్‌మని వెళ్తున్నారు.

ఇంట్లోకి వెళ్లిన కుసుమకుమారికి 'బాషా' సినిమాలోని రజనీకాంత్ స్టెప్స్ వేస్తూ కనిపించాడు కొప్పులరాజు.

"పాత బండి అమ్మినోడికేనా కష్టాలు? కొన్నవాడు కూడా కష్టాలు పడితేనే కదా మజా!" అంటూ భార్య బుగ్గ మీద చిటికె వేశాడు.

"భలే మొగుడు నా మొగుడు" అని సెకను పాటు ఆలోచనల్లో పడింది.

"పుస్తెలుంటే ఫుల్ పెన్షన్, లేకుంటే అర పెన్షన్ కదా" అని గుర్తొచ్చి మొగుడితో పాటు అడుగులేసింది కుసుమకుమారి.

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.** ***sunmagvaartha@gmail.com***

# జీవిత సోపానాలు

**యామిజాల జగదీశ్**

**జీవితంలో పురోగమించాలనే ఆశ ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అది అసహజం ఏమీ కాదు. ఉన్నత శిఖరాగ్ర భాగానికి చేరుకోవాలని అనుకోవడం అత్యాశ కాదు.**

**అయితే ఎక్కడికి పోతున్నామనే దానిపై స్పష్టత ఉండాలి. అనుకున్న లక్ష్య సిద్ధికోసం అహర్నిశలూ శ్రమించాలి.**

**కాళ్లు భూమ్మీద ఉండాలి. కళ్లు లక్ష్య సిద్ధిపై ఉండాలి.**

**ప్రతి మెట్టూ ఓ సాధనే అనుకోవాలి.**

ఎప్పుడూ ఓ విషయాన్ని మనసులో ఉంచుకోవాలి. జీవితం లాటరీ కాదు, ఏదో ఓ రోజు మనం కళ్లు తెరచి చూసేసరికి మనం అనుకున్నవన్నీ మన కళ్లముందు ఉండడానికి. మనం జీవితంలో ఒక్కో మెట్టుగానే ఎదగాలి. విజయం సాధించినవారి జీవిత చరిత్రలు చదవాలి. సాధనలు సృష్టించినవారి నడక, నడత తెలుసుకోవాలి.

లక్ష్య సాధన క్రమంలో మనల్ని మనం దగా చేసుకోకూడదు. సోమరితనం ఉండకూడదు. తమ అవసరాలన్నీ మానుకుని మనిషి జాతికి త్యాగం చేసేవారు సాధువులు, మహాత్ములు. ఆ స్థితి ఉన్నతమైనదే. ప్రస్తుతం నువ్వూ, నేనూ మనుషులం. మనల్ని మనం ఉన్నత స్థితి దిశలో నడిపించుకోవాలి. కుటుంబానికి అవసరమైనవి మనం చేయాలి. అది మన కనీస బాధ్యత. అయితే దానిని ఓ క్రమ పద్ధతిలో చేయాలి.

మన చుట్టూ విజయులుగా ఎదిగిన వారనేకులు ఉన్నారు. వారిలో ఒకరిద్దరి గురించైనా తెలుసుకుందాం.

జాకీచాన్ అనే అతను నటుడు. అతను స్టంట్ నటుడు. 'స్నేక్ ఇన్ ది ఈగిల్స్ షాడో', 'పోలీస్ స్టోరీ' అనే సూపర్ హిట్ కొట్టిన చిత్రాల కథానాయకుడే జాకీచాన్. ఆయన తండ్రి ఓ వంటమనిషి.

జాకీచాన్ పుట్టినప్పుడు ఆస్పత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం కట్టడానికి కావలసిన వెయ్యి రూపాయలు ఆయన దగ్గర లేవు. మిత్రుల దగ్గర కాళ్లా వేళ్లా పడి బతిమాలి అప్పు చేసి వైద్య ఖర్చులకు చెల్లించి తన కొడుకుని ఇంటికి తెచ్చుకున్నాడు తండ్రి.

ప్రపంచంలో పిజ్జా వ్యాపారం చేసే ప్రముఖ సంస్థ పేరు డామినో. ఈ సంస్థ యజమాని పేరు థామస్ మోర్గన్. ఈ సంస్థకు పలు దేశాలలో శాఖలున్నాయి. మోర్గన్ తన నాలుగో యేట తండ్రిని కోల్పోయాడు. మోర్గన్ తల్లి పేదరికంతో అష్టకష్టాలు పడింది. దారిద్ర్యాన్ని అనుభవించింది. ఆమెకు తన పిల్లలిద్దరినీ పెంచే శక్తి లేక మోర్గన్ని, అతని సోదరుడిని ఓ అనాథాశ్రమంలో చేర్చింది. పూర్తిగా తన శ్రమనే నమ్ముకుని కుబేరుడిగా ఎదిగిన వ్యక్తి మోర్గన్.



ఇలా ఎందరో పైకెదిగినవారున్నారు. అయితే వాళ్లు ఎలా ఎదిగారన్నది తెలుసుకోవాలి.

జాకీచాన్ ముందుగా హాంకాంగ్‌లో నిర్మించిన అనేక చిత్రాలలో స్టంట్ సన్నివేశాలలో మాత్రమే నటిస్తూ వచ్చారు. ఆ తర్వాత స్టంట్ చిత్రాలలో కథానాయకుడిగా ఎదిగారు. ఆయన ప్రదర్శించిన స్టంట్ సన్నివేశాలు, విజయం సాధించిన చిత్రాలు ఆయనను హాలీవుడ్ చిత్రాల వరకు తీసుకుపోయాయి.

ఆయన అంతర్జాతీయ స్థాయిలో ఓ గొప్ప స్టంట్ నటుడిగా ఎదిగారు. డబ్బుతో పాటు సకల వసతులు సమకూర్చుకున్న జాకీచాన్ ఐక్యరాజ్యసమితి తరఫున అనేక సేవా కార్యక్రమాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా పిల్లలకు, ఎయిడ్స్ రోగులకు తాను తన డబ్బు ఖర్చు పెడతానని ప్రకటించారు జాకీచాన్.

ఇక థామస్ మోర్గన్ తన సంస్థలో తనలాగా అష్టకష్టాలు పడిన యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించి వారికి తగిన శిక్షణ ఇప్పించి వారి పురోగతికి తోడ్పడ్డారు. యువకుల చదువు సంధ్యల కోసం కోట్లాది డాలర్లు విరాళంగా ఇచ్చారు.

జాకీచాన్, థామస్ మోర్గన్ తమ జీవితారంభంలో ఏ దశలో వున్నారో ఆ తర్వాత ఎలా ఎదిగారో చూసాం.

కనుక విజయం సాధించాలంటే జీవితంలో అనుకున్న లక్ష్య సాధన కోసం అహర్నిశలూ శ్రమించాలి. అంకిత భావంతో కృషి చేయాలి. ఏ దశలోనూ బద్ధకానికి అలవాటు పడకూడదు.

విజయం సాధించాలంటే ఓ క్రమ పద్ధతిలో ముందుకు సాగాలి. ఎక్కడికక్కడ మనల్ని మనం సమీక్షించుకోవాలి. ఎవరైనా ఏదైనా చెప్పినా వాటిని సహనంతో వినాలి.

మనం అనుకున్న లక్ష్యసాధనలో ఎటు పోతున్నామో, ఎక్కడ ఉన్నామో చూసుకోవాలి. అప్పుడు విజయం మనదవుతుంది.

సాహిత్యం

# తెలుగువారి జాతీయ కవి విశ్వనాథ

**ఆచార్య వేణు**


**ఆధునిక తెలుగు సాహిత్యంలో దేశం పట్టనంత కవిగా ప్రసిద్ధి చెందిన మహాకవి విశ్వనాథ. పాశ్చాత్య నాగరికత తుఫాను హోరులో కొడగట్టి పోతున్న దేశీయతను దేశభక్తిని అరచేతిని అడ్డు పెట్టి కాపాడడానికి ప్రయత్నించిన మహాకవి విశ్వనాథ సత్యనారాయణ. అస్వతంత్రతకు లోబడిన జాతి జీవనాడులలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రవహింపజేసిన జాతీయతావాది, జాతీయ కవి.**

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగానే ఆంధ్రుల్లో స్వాతంత్ర్య ఉద్యమంతో బాటు ఆంధ్రోద్యమం పెల్లుబుకుతున్న కాలం. ఆంధ్రులు ఒకవైపు భారత స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరులు పోస్తూనే ఆంధ్రోద్యమానికి పునాదులు నిర్మించుకున్నారు. 1913, 1915 సంవత్సరాల్లో బాపట్ల, కాకినాడలలో జరిగిన ఆంధ్ర మహాసభలలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తీర్మానాన్ని ఆమోదించారు. ప్రజా ప్రతినిధుల అంగీకారంతో భాషా ప్రయుక్త రాష్ట్ర నిర్మాణం చేయవచ్చని 1919లో రాజ్యాంగ చట్టంలో నిర్ణయించబడింది. సరిగ్గా ఇదే సమయంలో విశ్వనాథ ఆంధ్ర ప్రశస్తి కావ్యం రచించారు.

## కవితా వైభవం

ఆంధ్ర పౌరుషంతో చిగురించిన విశ్వనాథ కవిత ఆంధ్ర ప్రశస్తి కావ్యంలో పరిమళ భరితంగా పుష్పించింది. ఆ తర్వాత అది కల్పవృక్ష శోభితంగా విస్తరించి దేశం పట్టనంత ఎదిగి ఆంధ్ర సాహితీ లోకానికి ఆలోచనా అమృత ఫలాలను అందించింది. విశ్వనాథ కవితా వ్యక్తిత్వాన్ని పర్యాలోచన చేస్తే తొలిసారిగా ఆంధ్ర ప్రశస్తిలో స్థిర ధర్మాన్ని ఏర్పరుచుకుంది. శాబ్దిక శక్తిలో, సమాస గ్రథనంలో పలుకుబడిలో సంభాషణా చాతుర్యంలో వర్ణనా నిపుణతలో ఊహా వైభవంలో విశ్వనాథ కవితా ప్రతిభ సర్వత్రా కనబడుతుంది.

ఆ కాలంలో వచ్చిన ప్రధాన కవితా లక్షణమైన కాల్పనిక సౌందర్యం ఆంధ్ర ప్రశస్తి కావ్యం



నిండా కన్పిస్తుంది.

కావ్యంలో గుండెకాయ లాంటి పద్యం..

**మా పూర్వాంధ్ర ధరాధినాయక కథా మంజూషికా రత్నగా**
**థా పద్యావళి పేరిహారి సుమనోధామంబు మాధ్వీక భా**
**షా పృక్తంబు మహా ప్రబంధ రచనా సౌందర్యపున్ వాసనల్**
**తీపై క్రమ్మగ నాంధ్ర సోదరుల కందిత్తున్ గాళాంకమ్ముగన్**

నిశితంగా పరిశీలిస్తే ఈ పద్యం నాలుగు పాదాల్లో నాలుగు లక్షణాలు కన్పిస్తాయి.

1) కావ్య వస్తువు 2) కవితా ధర్మం 3) కావ్య ప్రయోజనం 4) కవి వ్యక్తిత్వం.

పూర్వాంధ్ర రాజుల కథాభరితమైన మంజూషిక(పేటిక) నుండి రత్నాల వంటి గాథలను వెలికితీసి పద్యావళితో ఒక మనోజ్ఞమైన దండను కూర్చి మాధ్వీక భాష అంటే ద్రాక్ష లాంటి తీయనైన భాషలో చక్కని చిక్కని తెలుగులో మాధుర్యం చవిచూచే విధంగా రచిస్తానని వారు చెప్పుకున్నారు.

**జో! సామీ మముగన్న యేలిక యిదో జోహారు జోహారు మా**
**శ్రీ శైలంబున బెద్దకొండ దరిగర్వీభూత చేతస్కుడై**
**యీశారాధన బద్ధ దోర్బలుడు దైత్యేంద్రుండు లేడా! బుభు**
**క్షా సంపూర్తికి నోచుకోముగ కక్కావాని దుశ్చేష్టలన్**

ఇది ఆంధ్ర మహావిష్ణువు అనే మొదటి ఖండికలోని మొదటి పద్యం.

నిశుంభుడనే రాక్షసుని బాధలు భరించలేక కోయజాతివారు రాజుతో మొరపెట్టుకునే సందర్భంలోనిదీ పద్యం. ఇష్టదేవతా ప్రార్థనతో సర్వసాధారణంగా ఏ కావ్యమైనా మొదలు పెట్టడం ఒక సంప్రదాయం. ఈ కావ్య మర్యాదను కథా సందర్భంతో మేళవించి విశ్వనాథవారు ఒక వినూత్న శిల్పాన్ని ఆవిష్కరించారు.

జో! సామీ అంటూ ఆంధ్రుల ఇష్టదైవమైన ఆంధ్ర విష్ణువును స్తుతించాడు కవి. అంతే కాకుండా ఈ పద్యంలో కోయల సహజ సంభాషణా శైలిని చక్కగా వ్యక్తపరిచాడు. "బుభుక్షా సంపూర్తికి" నోచుకోని కోయలు పారతంత్ర్య పాలనలో చిక్కుకున్న భారతీయులవలె–

(మిగతా 29వ పేజీలో...)

## వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికిందరాబాద్
సెల్: 9885446501/9885449458



# పిచ్చిమొక్కలు అనుకుని పీకేయవద్దు

**సి.కావ్య – నిడదవోలు**

**ప్రశ్న: ఆనందం, ఐశ్వర్యం.. ఇవన్నీ ఉండాలంటే తులసి మొక్క ఇంట్లో నాటుకోవాలి అంటుంటారు. తులసిమొక్క మాత్రమే కాకుండా ఇలాంటి మంచి ఫలితాలను ఇచ్చే మొక్కలు అంటే ఇంట్లో నాటుకోవాల్సిన శుభకరమైన మొక్కలు ఇంకేవైనా ఉన్నాయా?**

**జవాబు:** ప్రతి మొక్క, ప్రతి చెట్టు కూడా శుభకరమైనదే. ప్రతి మొక్క, ప్రతి చెట్టు బెరడు, ఆకు, వేరు, ప్రతి అణువు కూడా ఏదో ఒక ఔషధానికి పనికొస్తుంది. మానవాళికి మేలు చేస్తుంది. ప్రతి మొక్క కూడా భౌతికంగా, ఔషధ పరంగా మానవాళి అదృష్టానికి మేలు చేస్తాయి. ఏ మొక్క దేనికి పనికొస్తుందో ఆ విధంగా ఉపయోగించుకొని అనేక సత్ఫలితాలను పొందవచ్చు. ఉదా: ‘శమీ వృక్షం’ తీసుకోండి. శమీవృక్షం







(జమ్మిచెట్టు) దారిద్ర్య నాశన వృక్షంగా చెప్పబడింది.

## శమీ వృక్షం

శమీవృక్షం ఘనత చెప్పాలంటే చాలా ఉంది. కానీ ప్రస్తుతం అవసరమైన వరకే చెప్పుకుందాం..

ఎంత దారిద్ర్యంలో వున్నవాళ్లయినా సరే ఒక్కసారి శమీవృక్షం దగ్గరికి వెళ్లి, కొన్ని ప్రదక్షిణాలు చేసి ఏదైనా తీపి పదార్థాన్ని హారతితో సమర్పించి, దండం పెట్టుకుంటే వాళ్లకు ఉన్న ఎలాంటి దరిద్రమైనా దూరమైపోతుంది. సందేహమే లేదు. కానీ ఈ వృక్షాన్ని మనం ఇంట్లో నాటుకోకూడదు. మంచిది కాదు. ఈ వృక్షం ఎక్కడ ఉందో ఆ క్షేత్రానికి వెళ్లి మనం ఈ ప్రక్రియ జరపవలసి ఉంటుంది. దేవాలయాలలో, పుణ్యక్షేత్రాలలో ఉండే శమీ వృక్షాలకి ఈ విధమైన నైవేద్యం సమర్పించటం వలన అత్యద్భుతమైన ఫలితాలు ఉంటాయి. ఇవి గాక సబ్జాగింజల

## సబ్జాగింజలు

‘సబ్జా చెట్టు’ అని ఉంటుంది. మీకు తెలిసే ఉంటుంది. సబ్జగింజలు నల్లగా నల్ల నువ్వుల పరిమాణంలో ఉంటాయి. వీటిని నీళ్లలో వేస్తే కాసేపటి తరువాత ఉబ్బుతాయి.

ఎండా కాలంలో సబ్జగింజలను నీళ్లలో వేసుకుని లేదా కూల్ డ్రింక్స్‌లో వేసుకొని తాగుతూ ఉంటారు. ఇలా తాగటం వల్ల శరీరానికి చాలా చలువ చేస్తుంది. వీటిని కొంచెం నలిపి వాసన చూస్తే అత్యద్భుతమైన పరిమళం వస్తుంది. కుండీలలో కానీ, నేల మీద కానీ వీటిని నాటుకోవచ్చు. ఈ మొక్కలు ఇంట్లో లేదా ఇంటి ఆవరణలో ఉండటం వలన ఫలితాలు బాగుంటాయి. ముఖ్యంగా రావలసిన డబ్బులు చేతికందటం, ఆదాయ వనరులు పెరగటం, పిల్లలు సంతోషంగా ఉండటం లాంటి మంచి ఫలితాలు ఉంటాయి.

## వేపచెట్టు

వేపచెట్టును కూడా ఇంట్లో పెంచుకోవచ్చు. కానీ దీనికి తగినంత ఖాళీ స్థలం ఇంట్లో ఉన్నప్పుడే ఇంటి ఆవరణలో నాటుకోవాలి.

తులసి మొక్కలకు ఎక్కువ ఖాళీ స్థలం అవసరం లేదు. నేలపైన కానీ తొట్లలో కానీ పెట్టుకోవచ్చు. పెరగటానికి కావలసిన కనీస ఖాళీ స్థలం ఉన్నప్పుడు మాత్రమే ఈ వృక్షాన్ని ఇంట్లో నాటుకోవాలి. అలాగే తులసి మొక్కని ఇంటికి ఏ దిక్కులో ప్రతిష్ఠించుకుంటే ఎటువంటి శుభ ఫలితాలు ఉంటాయో కూడా శాస్త్రంలో చెప్పారు.

## తిప్పతీగ

ఇంకొక మొక్క తిప్పతీగ. ఇది కూడా అద్భుతమైనటువంటి ఔషధీయ మొక్క. ఈ ఆకులో అణువణువు ఔషధంగా ఉపయోగపడుతుంది. తిప్పతీగ ఆకులను చూసినా కూడా అదృష్టం వరిస్తుంది. వీటిని తొట్లలో పెంచుకోవచ్చు, నేలలో పెంచుకోవచ్చు. ఓపెన్ ప్లేస్‌లో నాటుకోవాలి.

తిప్పతీగను శుభకరంగా పరిగణిస్తారు. శుభ ఫలితాలను ఆ విధంగానే ఇస్తూ ఉంటుంది. తిప్పతీగ అప్రయత్నంగా గడ్డిమొక్కల్లో పెరిగితే మాత్రం చెప్పరాని అదృష్టం పడుతుంది. తులసి మొక్కల్లాంటివన్నీ సాధారణంగానే మంచి ఫలితాలను ఇచ్చేవే. అదృష్టాన్ని తెచ్చే మొక్కలు అనేకం ఉంటాయి. కొన్ని మనం చెప్పుకుంటాం. కొన్ని అజ్ఞాతంగా మిగిలిపోతాయి.

(మిగతా 29వ పేజీలో...)

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం ‘వాస్తువార్త’లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

### వాస్తువార్త

పూర్తి పేరు.............................................................

పుట్టినతేదీ : ..................... ఊరు : .................

జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: ....................

చిరునామా: ...........................................................

కస్తూరి మురళీకృష్ణ




# నిస్వార్థ దానం

అది వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం. ఆ కాలంలో బోధిసత్త్వుడు చెవుల పిల్లి కడుపున పుట్టాడు. చెవుల పిల్లిగా జన్మించాడు కాబట్టి అడవిలో నివసించేవాడు.

ఆ అడవి పక్కనే ఒక పెద్ద పర్వతం ఉండేది. మరోవైపు నది ప్రవహిస్తుండేది.

ఇంకోవైపు ఒక గ్రామం ఉన్నాయి.

చెవుల పిల్లి అంటే కుందేలు. కుందేలయిన బోధిసత్త్వుడికి కోతి, నక్క, మత్స్యఖాది అనే ముగ్గురు స్నేహితులున్నారు.

ఆ నలుగురు స్నేహితులు ఒకేచోట కలిసి నివసించేవారు. ఎవరి ఆహారం కోసం వారు తగిన ప్రదేశాలలో విహరించి సేకరించేవారు.

అలా వారంతా కలిసినపుడు కుందేలు వారికి ఉపదేశం ఇస్తుండేది.



మంచి మాటలు చెప్తుండేది.

"దానం చేయాలి. శీలాన్ని కాపాడుకోవాలి. ఉపవాస వ్రతాన్ని తప్పనిసరిగా పాటించాలి" అంటూ వారికి బోధన చేసేది.

మిగిలిన ముగ్గురూ కుందేలు చెప్పే మంచి మాటలు వింటూ, తమలో తాము ఆలోచించుకుంటూ జీవించేవారు.

ఇలా కొన్నాళ్ళ గడిచాయి.

ఒకరోజు బోధిసత్త్వుడు అవకాశాన్ని చూసి, చంద్రుడి స్థితిని గమనించి, మరుసటి రోజు ఉపవాస వ్రతం ఆచరించాల్సిన రోజని గ్రహించాడు.

ఆ విషయం మిగిలిన ముగ్గురు మిత్రులకు తెలిపాడు.

"మీరు రేపు తప్పనిసరిగా ఉపవాసం చేయాలి. చక్కని మనసుతో ఎలాంటి కాంక్షలు లేకుండా దానం చేయాలి. కాబట్టి మీరు భోజనం చేసే సమయంలో ఎవరైనా భిక్షగాడు వచ్చి ఆహారాన్ని వేడితే ఆయనకు కడుపు నిండా పెట్టిన తరువాత మిగిలిన ఆహారాన్ని మీరు స్వీకరించాలి" అని చెప్పాడు.

అందరూ "సరే" అన్నారు.

మరుసటి రోజు తెల్లారగానే మత్స్యఖాది ఇల్లు వదలి బయలుదేరింది. గంగా తీరం చేరింది.

అది గంగాతీరం చేరేసరికి, ఒక పల్లెవాడు ఏడు చేపలను పట్టుకున్నాడు. వాటిని ఒక తాడుతో కట్టి, గంగ ఒడ్డున ఉన్న ఇసుకలో ఉంచాడు. ఇంకా చేపలను పట్టుకోటానికి గంగవైపు వెళ్లాడు.

మత్స్యఖాదికి చేపలవాసన వచ్చింది.

వెతికితే ఇసుకలో చేపలు కనిపించాయి.

"ఇవి ఎవరివి?" అరిచింది.

సమాధానం రాలేదు.

"ఇసుకలో చేపలున్నాయి. ఈ చేపలు ఎవరివి?" అరిచింది.

సమాధానం రాలేదు.

"అయ్యా... ఇక్కడ చేపలను ఎవరుంచారు? వీటి యజమాని ఎవరు?

అది ఎన్ని మార్లు పిలిచినా ఎవ్వరూ పలుకలేదు.

దాంతో "వీటికి యజమాని లేడు. ఇవి ఎవరికీ చెందినవి కావు. కాబట్టి, వీటిని నేను తీసుకుంటే వేరేవారికి చెందిన వస్తువులు వారి అనుమతి లేకుండా తీసుకున్న దోషం నాకు అంటదు" అనుకుంది.

మరోసారి అటూ ఇటూ చూసింది.

చుట్టుపక్కల ఎవ్వరూ కనబడలేదు. వెంటనే ఆ చేపలను ముక్కున కరుచుకుని ఇల్లు చేరింది.

"ఇన్ని చేపలను ఒక్కసారి తినటం కష్టం. కాబట్టి అవసరం అయినప్పుడు తింటాను వీటిని" అని ఆ ఏడు చేపలను ఒక చోట దాచింది.

తాను చేసింది తప్పా? సరైనదా? దీనివల్ల తన శీలానికి మచ్చ ఏమైనా వస్తుందా? అని ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది.

నక్క కూడా ఆహారం కోసం పొద్దున్నే బయలుదేరింది.

అలా తిరుగుతుంటే దానికి ఒక కుటీరం కనిపించింది. తలుపులు తెరిచి ఉండటంతో అది కుటీరం లోపలకు ప్రవేశించింది. లోపల దానికి రెండు మాంసంముక్కలు కనిపించాయి.

మాంసం ముక్కల పక్కనే ఉడుము, పాలు నిండిన కుండ కనిపించాయి.

"వీటి యజమాని ఎవరు?" అని చుట్టూ చూసింది.

"ఇక్కడ వస్తువులు ఎవరివి?" అరిచింది.

సమాధానం రాలేదు.

"ఈ వస్తువుల యజమాని ఎవరు?" అరిచింది.

సమాధానం రాలేదు.

"ఇక్కడున్న వస్తువులు ఎవరికి చెందినవి?" అని అరిచింది.

సమాధానం రాలేదు.

"వీటికి యజమాని ఉన్నట్టు లేదు. యజమాని లేదు కాబట్టి వీటిని నేను తీసుకోవచ్చు. ఇందువల్ల నా శీలానికి భంగం కాదు" అనుకుంది.

మాంసం ముక్కలను, ఉడుమును, పెరుగుకుండను తీసుకుని తన నివాసానికి వెళ్లింది.

"ఇన్ని ఒక్కసారే తినలేను కాబట్టి, అవసరమైనపుడు తింటాను" అనుకుని వాటిని భద్రంగా దాచింది.

కోతి కూడా పొద్దున్నే లేచి ఆహారానికి బయలుదేరింది.

ఒక చెట్టుపై నుంచి మరో చెట్టుపైకి దూకుతూ మామిడి పండ్ల వనంలోకి వెళ్లింది.

చెట్టుకు గుత్తులు గుత్తులుగా ఉన్నాయి మామిడిపండ్లు.

"ఈ మామిడిపండ్లు ఎవరివి?" అరిచింది.

సమాధానం రాలేదు.

"ఈ తోట యజమాని ఎవరు?" అడిగింది.

సమాధానం రాలేదు.

"ఈ చెట్టు ఎవరివి?" అడిగింది.

సమాధానం లేదు.

"ఈ మామిడి పండ్లు, చెట్లు ఎవరికీ చెందినవి కావు. కాబట్టి వీటిని నేను తీసుకుని వెళ్తే నా శీలం భంగం కాదు" అనుకుంటూ మామిడిపండ్ల గుత్తిని తీసుకుని ఇంటికి వెళ్లింది.

"ఇన్ని పండ్లు ఒకేసారి తినలేను కాబట్టి అవసరం అయినప్పుడు తింటాను" అని వాటిని భద్రంగా దాచింది.

> **"ఇదేరకమైన అగ్ని? ఇది నన్ను కాల్చటం లేదు.. ఎందుకు?" అడిగింది కుందేలు ఆశ్చర్యంతో. "నేను బ్రాహ్మణుడను కాదు. శుక్రుడను. నీ దాన గుణాన్ని పరిశీలించాలని వచ్చాను" అన్నాడు శుక్రుడు.**

బోధిసత్త్వుడు కూడా ఉదయమే లేచాడు. "ఈరోజు ఉపవాసం. నేను తృణధాన్యాలు మాత్రమే తింటాను. కాబట్టి ఎటూ వెళ్లనక్కర్లేదు. కానీ ఎవరైనా వచ్చి ఆహారం కావాలని భిక్ష అడిగితే వారికి నేను బియ్యంగింజలు ఇవ్వలేను. ధాన్యాలు ఇవ్వలేను. ఏం చేయాలి?" అని ఆలోచించాడు.

చివరికి ఒక నిశ్చయానికి వచ్చాడు. "కుందేలు మాంసం రుచికరంగా ఉంటుందని అంటారు. ఎవరైనా వచ్చి ఆహారం యాచిస్తే వారికి నేను నా శరీర మాంసాన్ని ఆహారంగా అందిస్తాను" అనుకుంది.

కుందేలు ఇలా అనుకోగానే శుక్రుడి దగ్గర ఉన్న శిల వేడి అవసాగింది. ధ్యానంతో శుక్రుడు తన దగ్గర ఉన్న దానశిల వేడి ఎందుకయిందో గ్రహించాడు.

"ఈ కుందేలు దానతత్పరతను పరిశీలించాలి" అనుకున్నాడు. బ్రాహ్మణ రూపం ధరించాడు. ముందుగా మత్స్యఖాది ఇల్లు చేరాడు.

"ఏం కావాలి?" అడిగింది మత్స్యఖాది.

"ఆహారం.. తినటానికి ఏమైనా దొరుకుతుందా?" అడిగాడు.

"ఉంది. నా దగ్గర ఏడు చేపలున్నాయి, తీసుకోండి" అంది మత్స్యఖాది.

"ఉంచు. నేను స్నానం చేసి వస్తాను" అన్నాడు బ్రాహ్మణుడు. అటు నుంచి తిన్నగా నక్క దగ్గరకు వెళ్లి "తినటానికి ఏమైనా ఉందా?" అడిగాడు.

"ఉంది. మాంసం ఉంది, ఉడుము ఉంది, పెరుగు ఉంది" అని అన్నీ అతని ముందు పెట్టింది నక్క.

"అవి ఉంచండి. నేను ఇప్పుడే స్నానం చేసి వస్తాను" అని కోతి దగ్గరకు వెళ్లాడు.

"ఆహారం కావాలి" అడిగాడు.

తాను దాచిన వాటిని అతని ముందుంచింది కోతి.... "స్వీకరించండి" అంది.

"వాటిని అలాగే ఉంచు. స్నానం చేసి వస్తాను" అన్నాడు బ్రాహ్మణుడు.

తిన్నగా కుందేలు దగ్గరకు వెళ్లాడు.

"ఆహారం కావాలి" అడిగాడు.

"రండి.. మీ కోసమే ఎదురు చూస్తున్నాను. మీరు నా దగ్గరకు వచ్చి మంచి పని చేశారు, మీకెవరూ ఇవ్వనటువంటి దానం ఇస్తాను. మీరు హింస చేయరు కాబట్టి మీరు కట్టెపుల్లలు ఏరుకువచ్చి, వాటిని పేర్చి నిప్పు రాజేయండి. నేను అగ్నిలో దూకుతాను. నా శరీరం చక్కగా ఉడకగానే మీరు భోజనం చేయండి" అంది కుందేలు. అలా అంటూనే దర్భశయ్య ఏర్పాటు చేసి దాని మీద పడుకుని "కట్టెలు తెచ్చి నిప్పు రాజేయండి" అంది కుందేలు.

అది వింటూనే శుక్రుడు ప్రసన్నుడయ్యాడు. నిప్పు రాజేశాడు.

"నా శరీరం మీద ఏమైనా క్రిములుంటే పోతాయి" అని శరీరాన్ని బాగా విదిలించి నిప్పులోకి దూకింది కుందేలు.

చిత్రంగా నిప్పు కుందేలును కాల్చలేదు. వేడి అగ్ని చల్లగా అనిపించింది దానికి.

"ఇదేరకమైన అగ్ని? ఇది నన్ను కాల్చటం లేదు.. ఎందువల్ల?" అడిగింది కుందేలు ఆశ్చర్యంతో.

"నేను బ్రాహ్మణుడను కాదు. శుక్రుడను. నీ దాన గుణాన్ని పరిశీలించాలని వచ్చాను" అన్నాడు శుక్రుడు. బ్రాహ్మణ రూపంలో ఉన్న శుక్రుడికి నమస్కరించింది కుందేలు.

"కల్పాంతం వరకూ నీ పేరు ప్రసిద్ధమౌతుంది" అంటూ శుక్రుడు పర్వతాన్ని పిండి రసం తీసి చంద్రుడిపై కుందేలు ఆకారాన్ని నిర్మించాడు. ఆ ఆకారంలో కుందేలును ప్రవేశపెట్టి దేవలోకానికి వెళ్లిపోయాడు శుక్రుడు.

కుందేలు మిగతా మిత్రులు కూడా సంతోషంతో శీలాన్ని పాటించారు. ఉపవాస వ్రతం చేశారు. వారి వారి కర్మానుసారం పరలోకం చేరారు.

................

కథ పూర్తి చేసిన బుద్ధుడు చివరికి "ఆ సమయంలో మత్స్యఖాది ఆనందుడు. నక్క మోగ్గల్యాయనుడు. కోతి సారిపుత్రుడు. శుక్రుడు అనిరుద్ధుడు. కుందేలును నేనే" అని చెప్పాడు.

# ఫలించే ప్రార్థన

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

భగవంతుణ్ణి చేరడానికి అనేక మార్గాలున్నాయి. వాటిలో భక్తిమార్గం శ్రేష్ఠమైనదని చెబుతారు. స్వామికి భక్తులంటే ఎంతో ఇష్టం. వారికోసం తాను ఎన్ని కష్టాలైనా భరిస్తాడు. తన భక్తులను ఎవరైనా నిందించినా సహించడు. వారి భక్తిప్రపత్తులకు లోనై వుంటాడు.

కేరళలో గురువాయూరు కృష్ణ భక్తులకు నిలయం. ఒకానొక కాలంలో గురువాయూరులో ఇద్దరు కృష్ణ భక్తులుండేవారు. వారి భక్తి ఎంత గొప్పదంటే కృష్ణపరమాత్మ వారితో కాలం గడిపేవాడు. చిన్న పిల్లవాడిలా ముద్దు ముద్దు మాటలతో చిలిపిచేష్టలు చేస్తూ ఆనందంగా వారితో ఆడుకునేవాడు. ఆ ఇద్దరు కృష్ణ భక్తుల్లో ఒకరు గురూరమ్మ అనే మహిళ. రెండవవారు బిల్వమంగళ్.



క్రిష్ణయ్య రోజూ వారి ఇళ్లకు వెళ్లేవాడు. వాళ్లు పెట్టింది తినేవాడు. వీళ్లిద్దరూ కృష్ణయ్యకు ఎంతో ప్రియమైన భక్తులు. "గోపాలా, నీ కోసం ఎంతసేపని తిండి తినకుండా వేచి ఉండేదిరా, త్వరగా రా తండ్రీ" అంటూ– కృష్ణయ్య కనపడకపోయేసరికి వేడుకునేది గురూరమ్మ.

అయితే స్వామి ఆమె వెనుకే వుండేవాడు. "నేను వచ్చి ఎంత సేపయిందో, ఇక్కడే నిలబడి వున్నాను కదా, అసలు నువ్వు వెనుకకు తిరిగిచూస్తే కదా" అంటూ ఆమెని ఆట పట్టించేవాడు. అదే సమయంలో బిల్వమంగళ్ దగ్గరా వుండేవాడు. "స్వామీ, ఈరోజు ఏకాదశి. నీకు ఈరోజు తులసితీర్థం మాత్రమే" అని చెప్పగానే..

కృష్ణయ్య "అదేం కుదరదు, నాకు మాత్రం పాలపాయసం కావాలి. ఆ తులసి తీర్థమేదో నువ్వే తీసుకో" అనేవాడు.

ఒకసారి ఏం జరిగిందంటే– గురూరమ్మకూ, బిల్వమంగళుడికి చిరపరిచితమైన ఓ వ్యక్తికి కడుపునొప్పి వచ్చింది. ఆ వ్యక్తి మొదట బిల్వమంగళుడి దగ్గరకు వచ్చాడు.

"బిల్వమంగళా! నేను కడుపునొప్పితో బాధపడుతున్నాను కదా! నీ కృష్ణునితో చెప్పవయ్యా" అని అడిగాడు.

"అంతేకదా, ఇవాళే చెబుతాను" అన్నాడు బిల్వమంగళుడు.

కృష్ణుడు వచ్చిన తర్వాత "కృష్ణా! నాకు తెలిసిన ఒక వ్యక్తి ఉదయం వచ్చాడు. అతను కడుపునొప్పితో చాలా బాధపడుతున్నాడు, నీతో చెప్పమన్నాడు".

దానికి కృష్ణుడు "దానికి నేను ఏం చేయడం, అతని పూర్వజన్మ కర్మఫలాన్ని వాడు ఇప్పుడు అనుభవిస్తున్నాడు" అని సమాధానం ఇచ్చాడు.

"ఓహో అలానా!" అని బిల్వమంగళుడు సరిపెట్టుకున్నాడు.

మరుసటి రోజు ఆ వ్యక్తి బిల్వమంగళుడి దగ్గరికి వచ్చాడు. "నా కడుపునొప్పి విషయం కృష్ణునితో చెప్పావా?" అని అడిగాడు.

"ఓ! మరిచిపోకుండా చెప్పాను. అది నీ పూర్వజన్మ ఫలమన్నాడు. నువ్వు అనుభవించి తీరాల్సిందేనన్నాడు" అని కృష్ణుడు సమాధానమిచ్చాడు.

ఆ తర్వాత ఆ వ్యక్తి గురూరమ్మ దగ్గరకు వెళ్లాడు. "అమ్మా, కడుపునొప్పిని భరించలేకుండా వున్నాను. నువ్వే నాకు సాయం చేయాలి" అనగానే–

"చూద్దాం.. కృష్ణుడు వచ్చాక చెబుతాను" అంది.

సాయంత్రం కృష్ణుడు రాగానే భోజనం పెట్టింది. "కృష్ణా! నాకు తెల్సిన వ్యక్తి కడుపునొప్పితో బాధపడుతున్నాడు వానికి కాస్తం ఉపశమనం కలిగించరాదా. నీకిదో పెద్ద పనా? కనికరించు, వాడి నొప్పి పోగొట్టు" అని వేడుకుంది.

"ఓ... అలాగే పోగొడతాను, నయం చేస్తాను" అని కృష్ణుడు చెప్పాడు.

ఆ వ్యక్తికి కడుపునొప్పి పోయింది. అతడు తిన్నగా బిల్వమంగళుడి వద్దకు వచ్చాడు.

"నీ కడుపునొప్పి ఎలా వుంది?" అని అడగ్గానే–

"అదెప్పుడో ఎగిరిపోయింది. గురూరమ్మ నా గురించి కృష్ణునితో చెప్పింది. కృష్ణుని కృపా కటాక్షం నాకు కలిగింది" అని చెప్పింది.

దాంతో బిల్వమంగళుడు కృష్ణుణ్ణి నిలదీశాడు. "ఏం బిల్వమంగళా! ఏదో కోపంతో వున్నట్టుగా వున్నావు" అని కృష్ణుడు అడిగాడు.

"ఔను, వుండకేమౌతాను? ఆ వ్యక్తి కడుపునొప్పి గురించి అడిగితే అది వాడి పూర్వజన్మ కర్మఫలం, అనుభవించాల్సిందే" అన్నావు. గురూరమ్మ చెబితే మాత్రం నయం చేసావు" అనగానే–

కృష్ణుడు "నీవు నాతో.. వాడు బాధపడుతున్నాడు, నీతో చెప్పమన్నాడు" అనే కదా నువ్వు నాతో చెప్పావు. ఔనా! నేను అందుకు కారణం చెప్పాను, అంతే అన్నాడు" కృష్ణుడు.

"కానీ గురూరమ్మ చెబితే అతని కడుపునొప్పిని పోగొట్టావు కదా" అనగానే–

"అవును..! వాడి కడుపునొప్పి పోగొట్టు.. అంటూ" ఆమె ప్రాధేయపడింది. ఆమె ప్రార్థన అంగీకరించాను. కానీ నువ్వు అలా అడగలేదు కదా! అతడు చెప్పమన్న మాట చెప్పావు. నా అనుగ్రహం, కృపాకటాక్షం, ఎవరెవరు ఎలా ప్రార్థిస్తారో ఆ విధానాన్ని బట్టి ఫలితాలు వారికి ప్రాప్తిస్తాయి. ఇందులో నచ్చినవాడు, నచ్చనివాడు అనే తేడా నాకు లేదు" అన్నాడు కృష్ణుడు.

దాంతో బిల్వమంగళుడు "ప్రభూ! ప్రార్థించడంలో కూడా ఎన్ని విధానాలున్నాయో ఇప్పుడు నేను గ్రహించాను. నాకు నిజం తెలిసింది. నన్ను క్షమించు స్వామీ" అంటూ పాదాక్రాంతుడైనాడు గురువాయూరు కృష్ణునికి.

అడగందే అమ్మ అయినా అన్నం పెడుతుందా? అన్నట్లుగా ఆ శ్రీకృష్ణ పరమాత్ముడినైనా మనకు ఏం కావాలో కోరుకోవడంలో నిజాయితీ, నమ్మకం, పూర్తి భక్తి విశ్వాసాలూ వుండాలి. అప్పుడే ఆ స్వామి అనుగ్రహం లభిస్తుంది.

(24వ పేజీ తరువాయి...)

## తెలుగువారి జాతీయ కవి విశ్వనాథ

"గర్వీభూత చేతస్కుడైన దైత్యేంద్రుడు" బ్రిటిష్ సామ్రాజ్య నేతగా మనకు స్ఫురిస్తాడు.

"మాధవ వర్మ" అన్న ఖండికలో ధర్మప్రభువు యువరాజు పురవీధుల రథంపై వాహ్యాళి వెళ్లుచుండగా అతని రథ చక్రముల కిందబడి వృద్ధురాలి ఏకైక కొడుకు మరణిస్తాడు.

రాజు గూఢచారుల ద్వారా విషయం తెలుసుకొని ధర్మ నిర్ణయం చేసి, కుమారునికి మరణశిక్ష విధిస్తాడు.

పుత్రుని ప్రాణంకంటే ధర్మం వేయి రెట్లు గొప్పదనే సందేశాన్ని ఈ ఖండిక ద్వారా అందించాడు.

వృద్ధురాలు రాజుతో తనకు జరిగిన అన్యాయం గురించి తెలిపే సందర్భంలో కరుణ రసాన్ని ఆ తల్లి కడుపు వేదనను అద్భుతంగా వర్ణించాడు.

**ఇంతకు మించి ఆపదలికేమని కల్గు రథంబుచేత త్రొ**
**క్కింతురటయ్య భూ ప్రజల నెంతగ సున్న సిరుల్ భుజింత్రు పా**
**లింతురు రాజులైన నదలింతురు తప్పులు కల్గినన్ విచా**
**రింతురుగాక చంపుట సరే ప్రజనిట్టు లకారణంబుగన్**

అని ప్రశ్నిస్తుంది.

### ప్రోలరాజు అనే ఖండికలో-

**ఆ రబ్దేశ్వర తాండవ భ్రమణ పాదాంభోరు హస్త స్తమం**
**జీ రంబో గగనేందిరా కరపత్ర చ్ఛీ కందుకంబో ప్రన**
**స్వారాజ్య చ్యుత భుక్త పుణ్యంబగు నక్షత్రంబొనాబశ్చిమా**
**శా రత్నాకరమందు గ్రుంకెను వివస్వద్బింబ మల్లంతలో**

ప్రతాపరుద్రుడు శివ ధ్యాన నిమగ్నుడై యున్నప్పుడు అస్తమిస్తున్న సూర్యుడు తాండవం చేస్తున్న శివుని పాద మంజీరంలా ఉన్నాడని, పడమట దిక్కు అనే సముద్రంలో సూర్యబింబం పడిపోయిందని చెప్పడం విశ్వనాథ వర్ణనా నిపుణతకు తార్కాణం.

### విశ్వనాథ దేశభక్తి

**ఇమ్మగ గాకుళమ్ము మొదలీవరకుంగల యాంధ్ర పూర్వ రా**
**జ్యమ్ముల పేరు చెప్పిన హృదంతరమేల చుంబిప్రోవ, నా**
**ర్ద్రమ్మగు చిత్తవృత్తుల పురాభవ నిర్ణయమేది నెన్ని జ**
**న్మమ్ములు గాగ నీ తనువునన్ ప్రవహించునో యాంధ్ర రక్తముల్**



ఈ పద్యంలో విశ్వనాథవారి దేశభక్తి కట్టలు తెంచుకొని ప్రవహిస్తున్నట్లుగా కనబడుతుంది. ఆంధ్ర రక్తముల్ అనే ప్రయోగం ఉదాత్తమైంది. కవి శరీరం నిండా జన్మ జన్మల నుండి ఆంధ్ర రక్తం ప్రవహిస్తుంది. ఇందులో మరెన్నెన్నో ఆర్ద్రమైన హృదయాన్ని తాకే ఎన్నో పద్యాలు, వర్ణనలు ఉన్నాయి.

ఈ కావ్యాన్ని విశ్వనాథవారి మిత్రులు గొప్ప చారిత్రక పరిశోధకులైన మల్లంపల్లి సోమశేఖర శర్మకు అంకితమివ్వడం జరిగింది. అంకితంలో కూడా ఔచిత్యాన్ని పాటించిన మహాకవి విశ్వనాథ.

(25 వ పేజీ తరువాయి...)

## పిచ్చి మొక్కలు అనుకుని పీకేయవద్దు

సబ్జామొక్కలు, తిప్పతీగలు అట్లా ఊరికే పెరిగిపోతుంటాయి. ఒక్కొక్కసారి మనం విత్తనాలు తెచ్చి వేయకపోయినా, పక్షులు అటూ ఇటూ తిరుగుతూ ఉంటాయి కదా, వాటి వల్ల కూడా ఈ విత్తనాలు అవి రెట్టేసిన రూపంలో, ఏదో రూపంలో పడి పెరిగిపోతూ ఉంటాయి వీటిని పిచ్చి మొక్కలనుకొని పీకి పారేస్తుంటారు. కానీ వాటికవే వచ్చి ఇంటి ఆవరణలో పెరుగుతుంటే మాత్రం ఆ ఇంటి వాళ్లని అదృష్టం వరించి వచ్చినట్టే అనుకోవాలి. అవేవో గడ్డిమొక్కలు, పిచ్చిమొక్కలనుకొని పీకిపారేయకూడదు. ఇకముందు ఇట్లాంటివి ఏమైనా జరిగితే మీరు వాటిని జాగ్రత్తగా కాపాడుకోండి.

సబ్జామొక్కలు, తిప్పతీగ మొక్కలు మీరు ఆన్‌లైన్‌లో చూసినా కనపడతాయి. గుర్తించడం చాలా తేలిక. వాటంతటవ అవే పెరగకపోయినా, ఎక్కడి నుంచి అయినా తీసుకువచ్చి, ఇంట్లో ప్రత్యేకించి తూర్పు ఖాళీ స్థలంలో ప్రయత్నపూర్వకంగా పెంచుకున్నా మంచి ఫలితాలు ఉంటాయి.


తిప్పతీగ

ఇవి ఎక్కువ ఎత్తు పెరగవు. సబ్జా మొక్కలు అయితే మూడు అడుగుల వరకు పెరుగుతాయి. తిప్పతీగ కొంచెం విస్తరిస్తూ పోతుంది. మొక్కలు నాటిన దగ్గరే కాకుండా అటు పక్కన, ఇటు పక్కన విస్తరిస్తూ పెరుగుతూ పోతాయి. మన ప్రమేయం లేకుండా వాటంతటవ అవి మొలకెత్తినా, మనం ప్రయత్న పూర్వకంగా వాటిని ఇంట్లో నాటుకున్నా ఫలితాలలో పెద్ద మార్పు ఏమీ ఉండదు. అదృష్టం, కీర్తి ప్రతిష్టలు పెరగటం పిల్లలలో సంతోషం వెల్లి విరియటం మొ॥ ఇవి తెచ్చే మంచి ఫలితాలు.

చెట్లకి అప్పుడప్పుడు కొంచెం నీళ్ల పోస్తూ, చెత్తా చెదారం లేకుండా చూసుకుంటూ ఉంటే, చాలా కాలం జీవించి ఉంటాయి. అవి జీవించి ఉన్నంత కాలం మంచి ఫలితాలు ఉంటాయి. కొంత మందికి వాళ్ల జన్మ నక్షత్రం రీత్యా మంచి ఫలితాలను ఇచ్చే మొక్కలు, చెట్లు ఉంటాయి. వాటిని 'మిత్ర వృక్షాలు' అంటారు. కొంత మందికి వాళ్ల జన్మ నక్షత్రం రీత్యా అచ్చిరాని మొక్కలు, వృక్షాలు కూడా ఉంటాయి. వాటిని 'శతృవృక్షాలు' అంటారు. అయితే ఈ తిప్పతీగ, తులసి, సబ్జామొక్కలు.. మొదలైనవి అందరికీ మిత్ర వృక్షాలే కానీ ఎవరికీ శత్రువృక్షాలు కావు.

ఏ విధమైన సంకోచం లేకుండా అందరూ అందరి ఇళ్లల్లో వీటిని పెంచుకొని ఆర్థిక ఉన్నతిని, కీర్తిప్రతిష్టలను, ఆరోగ్య వృద్ధిని పొందుతూ జీవితాలను సంతోషమయం చేసుకోవచ్చు.

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



విదేశాలలో ఉన్నవారికి సొంతింటి కల నెరవేరుతుంది. బ్యాంకు ఉద్యోగస్తులకు బాగుంటుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి వుంటారు. వాళ్లకోసం విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

## వృషభం



రహస్య మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చు కోవడం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందిస్తారు. ప్రేమ వ్యవహారాలు, వివాహాలు విఫలమవుతాయి. బ్యాంకు రుణాల గురించి అధికంగా ఆలోచిస్తారు. స్వల్ప ప్రయోజనాల కోసం పెద్ద స్థాయి పరిచయాలను ఉపయోగిస్తారు. మీ వ్యక్తిత్వానికి తగని పనులు చేస్తారు.

## మిథునం



ముఖ్యమైన సమాచారం, వస్తువులు ఆలస్యంగా చేరటం వల్ల నష్టపోయే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితి రాకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఫలితం ఉండదు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. స్వల్ప అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. దూర ప్రాంత ప్రయాణాలు ఉద్దేశపూర్వంగానే వాయిదా వేసుకుంటారు.

## కర్కాటం



స్థిర, చరాస్తులకు సంబంధించిన ముఖ్యమైన వ్యవహారాలు, విషయాలు నత్తనడకన సాగుతాయి. అయినవాళ్లతో విభేదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. కొంతమంది స్నేహితుల ద్వారా ఉపయుక్తమైన సమాచారం అందుకుంటారు. నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ప్రయాణాలలో ఆసక్తికరమైన అంశాలు తెలుసుకుంటారు.

## సింహం



కళాకారులకు అనుకూల సమయం. నూతన అవకాశాలు, ప్రాజెక్టులు అందుకుంటారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో ఉన్నవారికి అనుకూలమైన మార్పులు, హోదాలు ఏర్పడతాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల ప్రభావంగా తొందరగా అనారోగ్యాలు వాటిల్లే అవకాశం ఉంది. ఆహార నియమాల పట్ల కచ్చితమైన జాగ్రత్తలు పాటించండి.

## కన్య



ఎదురు చూస్తున్న మార్పులు ఏర్పడతాయి. శత్రు వర్గం ఎవరెవరు అన్న విషయాలను తెలుసుకుంటారు. సహోదర, సహోదరి వర్గంతో సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం ప్రదర్శించి సమస్యలు తలెత్తకుండా ప్రయత్నిస్తారు. జీవిత భాగస్వామి సలహాలు, సూచనలు మేరకు నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ప్రయోజనకరమైన అంశాలు తెలుసుకుంటారు.

## తుల




పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసే పరీక్షల్లో విజయం సాధిస్తారు. పరపతి, పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు స్నేహాలుగా మారతాయి. లీజులు, లైసెన్సులు, కాంట్రాక్టుల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగంలో మార్పులు ఏర్పడతాయి. కనుక ఉద్యోగం మారాలన్న ఆలోచనలు అధికంగా ఉంటాయి. క్రీడారంగంలో వున్నవారికి బాగుంటుంది.

## వృశ్చికం



స్వల్పమైన అనారోగ్య సమస్యలతో సతమత మవుతారు. కళా, సాహిత్యకారులకు పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి, సన్మాన యోగం కలుగుతుంది. కార్యాలయంలో కొత్త వాతావరణం ఏర్పడుతుంది. కొంతమంది వ్యక్తుల ప్రవర్తన బాధకి, భావోద్వేగాలకి కారణమవుతుంది. స్నేహితులు, సహ ఉద్యోగుల సహాయం కొంతమేరకు ఉపయోగపడుతుంది. నూతన వ్యాపార ఒప్పందాలు బాగుంటాయి. శుభ వార్తలు వింటారు.

## ధనుస్సు



ఆలోచనలలో మార్పులు ఏర్పడతాయి. కొద్దిపాటి ఒత్తిడిని కూడా భరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. కొన్ని కార్యక్రమాల నిమిత్తం మీ పలుకుబడిని, పరపతిని ఎంతగానో ఉపయోగిస్తారు. ఆ ప్రయత్నాలు సఫలీకృతమవుతాయి. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారం ప్రారంభిస్తారు. రాత పూర్వకమైన పత్రాల పట్ల కచ్చితమైన శ్రద్ధ చూపించండి. కీళ్లనొప్పులు, నేత్ర వ్యాధుల సమస్యలు వచ్చే సూచనలున్నాయి.

## మకరం




కొంతమంది వ్యక్తుల ప్రవర్తన మీకు నచ్చక కొన్ని నిర్ణయాలు వెనువెంటనే తీసుకుంటారు. దూర ప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. కాపురంలో చిచ్చు పెట్టేవారిని గుర్తిస్తారు. వీరి పట్ల మీ ప్రవర్తన మారుతుంది. ఇలాంటి వాళ్లకి అవకాశం, ఆశ్రయం ఇవ్వకూడదని నిర్ణయించుకుంటారు. ఇంట్లో శుభకార్యాల గురించి ప్రస్తావన వస్తుంది. ఈ విషయంపై మీ అభిప్రాయం వెనువెంటనే తెలియజేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

## కుంభం




మీకు ఉన్న ధైర్యం, స్ఫూర్తి మీ వాళ్లకి లేదని బాధ పడాలో, లేదా భయపడాలో అర్థం కాదు. దీర్ఘాలోచనలు చేస్తారు. గురువుల ద్వారా ధైర్యం, మంచి సలహాలు స్వీకరించగలుగుతారు. మీ శ్రమకి, మీ కష్టానికి ప్రతిఫలం అందుకుంటారు. రాజకీయ పైరవీలు లాభిస్తాయి. వాక్చాతుర్యంతో ఎంతటి క్లిష్ట పరిస్థితుల నుండైనా బయట పడతారు.


## మీనం




వ్యాపారాలలో ఆదాయం రొటేషన్ల రూపంలో ఉంటుంది. కార్యాలయంలో కొంతమంది చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను బయట పెట్టడానికి చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. ఆహార, పానీయాల పట్ల శ్రద్ధ అవసరం. ఆరోగ్య విషయంలో, వాహన విషయంలో నిర్లక్ష్యం తగదు. దూర ప్రయాణాలు కలిసి వస్తాయి. కొత్త పరిచయాల వల్ల మిత్రులు లభిస్తారు. వ్యాపారాలు లాభాల బాటలో ఉంటాయి.

# ఈ వారం 'కార్టూన్స్'


ఓ.. IAS అయిపోతావని మిడిసి పడకు..!!
నేను మినిస్టర్ అయ్యాక, నీవు పనిచేసేది నా కిందే...!!!


మరి బంజరు, పోరంబోకు భూముల కబ్జా సంగతి?!
- హైడ్రా -


గుడినీ, గుడిలో లింగాన్ని మింగేసే టైప్ అట కదా..?
ఏదీ ఒకసారి చూపించు నీ టాలెంట్..!!?







క్యాపిలానో సస్పెన్షన్ అని పిలవబడే వేలాడే ఈ వంతెన కెనడాలోని నార్త్ వాంకూవర్‌లో ఉంది. రెండు కొండలను కలుపుతున్న ఈ వంతెన మీదుగా వెళ్తున్నప్పుడు కలిగే అనుభూతి మాటలకందనిది.







